ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శనివారం | 17-10- 2026 | సంపుటి: 17, సంచిక: 196, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

హ్యుందాయ్ మెగా ప్లాన్!

తెలంగాణకు హ్యుందాయ్ భారీ పెట్టుబడులు.. 4,276 ఉద్యోగాలు!

హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయండి

సంస్థ యాజమాన్యానికి సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రం.. త్వరలోనే భూమిపూజకు సిద్ధం..

పెండింగ్ అనుమతులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

తెలంగాణలో తయారీ రంగానికి అన్ని విధాలా సహకరిస్తాం: సీఎం



హైదరాబాద్, అక్టోబరు 16 (ప్రజాకలం) :

తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యూన్ చో నేతృత్వంలోని

తరువాయి 2వ పేజీలో...



మూడు నెలల్లో రోహిత్ వేముల తెలంగాణ బిల్లు

ముసాయిదా సిద్ధం చేయాలి

అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు

విద్యార్థుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు

న్యాయ, విద్యా, హోంశాఖలు, యూజీసీ భాగస్వామ్యంతో కసరత్తు

సచివాలయంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం

సమావేశానికి హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హైదరాబాద్, అక్టోబరు 16 (ప్రజాకలం) :

శ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల హక్కులను పరిరక్షిస్తూ, కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్షకు తావులేకుండా సమగ్ర చట్టాన్ని రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత 'రోహిత్ వేముల తెలంగాణ బిల్లు'కు సంబంధించిన ప్రాథమిక ముసాయిదాను మూడు నెలల్లోగా సిద్ధం చేసి సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీ (సీఎస్‌సీ)కి సమర్పించాలని స్పష్టం చేశారు. కమిటీ ఏర్పాటు నుంచి వివిధ భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపుల వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో

తరువాయి 2వ పేజీలో...

రైతులకు కష్టాలు తప్పవా?

నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలం

రేవంత్ సర్కారుపై కవిత ఫైర్!



హైదరాబాద్, అక్టోబరు 16 (ప్రజాకలం) :తెలంగాణలో రాబోయే నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రతరం కావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎల్ నినో హెచ్చరికలు ముందే వచ్చినా పట్టించుకోలేదా?

ఎల్ నినో ప్రభావంపై నిపుణులు ఏడాది ప్రారంభంలోనే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం ముందస్తు నివారణ చర్యలు తీసుకోలేదని కవిత ఆరోపించారు. పొరుగు రాష్ట్రాలు కరవు పరిస్థితులను గుర్తించి కరవుమండలాల ప్రకటనలు, కేంద్రానికి నివేదికలు సమర్పించడం వంటి చర్యలుచేపట్టాయని పేర్కొన్నారు.తెలంగాణలో మాత్రం ఇప్పుడు రైతులను త్యాగాలు చేయాలని కోరడం సమంజసం కాదని విమర్శించారు

మరో 10 నెలలు నీటి కష్టాలేనా?

రాబోయే పది నెలల్లో రాష్ట్రం తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని

తరువాయి 2వ పేజీలో...

సోయా రైతుల కష్టంపై

దళారుల కన్ను!

మద్దతు ధరకు మంగళం.. తేమ పేరుతో కోతలు, తూకాల్లో మాయాజాలం?

బైంసా, కుబీర్, తానూర్‌లో అక్రమ కొనుగోళ్ల ఆరోపణలు.. అధికారుల నిఘా ఏది?

నిర్మల్ అక్టోబర్ 16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఆరుగాలం కష్టపడి పండించిన సోయాబీన్ పంటకు గిట్టుబాటు ధర దక్కక అన్నదాతలు అల్లాడుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర అందాల్సిన చోట ప్రైవేటు వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తేమ శాతం పేరుతో ధరల్లో కోతలు విధించడం, తూకాల్లో అక్రమాలకు పాల్పడటం, పంట విక్రయించిన తర్వాత కూడా డబ్బులు చెల్లించకుండా రైతులను తిప్పించుకోవడం వంటి ఫిర్యాదులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. బైంసా, కుబీర్, తానూర్ ప్రాంతాల్లో సోయాబీన్ కొనుగోళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరతో పోలిస్తే తక్కువ మొత్తానికి పంట కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందంటూ క్వింటాలుకు వందల రూపాయలు తగ్గిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మరోవైపు, మార్కెట్ యార్డుల్లో కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగకపోవడం, చెల్లింపుల్లో జాప్యం వంటి సమస్యలు రైతులకు మరింత భారంగా మారుతున్నాయి.



లైసెన్సులు ఉన్నా.. నిబంధనలు పాటిస్తున్నారా?

కుబీర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో లైసెన్సు పొందిన కమిషన్ ఏజెంట్లు, ఇతర వ్యాపారుల కొనుగోళ్లపై పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తరువాయి 2వ పేజీలో...



ఐటీ షేర్లకు కొత్త ఊపు

అసలు కారణాలివే!

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో ఐటీ రంగ షేర్లు మరోసారి ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించాయి. అక్టోబర్ 16 శుక్రవారం ఉదయం ట్రేడింగ్‌లో టెక్ మహీంద్రా, విప్రో, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేర్లు లాభాల్లో కదిలాయి. మెరుగైన త్రైమాసిక ఫలితాలు, భారీ డీల్స్‌పై అంచనాలు ఈ ర్యాలీకి మద్దతుగా నిలిచాయి.

టెక్ మహీంద్రా టాప్ గేర్‌లో..

అందుబాటులో ఉన్న ట్రేడింగ్ వివరాల ప్రకారం, టెక్ మహీంద్రా షేరు సుమారు 7.11 శాతం పెరిగింది.

తరువాయి 2వ పేజీలో...

వ్యాపారాలకు నష్టం వద్దు

నిరసనలూ కావాలి.. వ్యాపారాలూ సాగాలి: సుప్రీంకోర్టు

కన్నాట్ ప్లేస్ వ్యాపారుల పిటిషన్‌పై కీలక వ్యాఖ్యలు

తక్షణ ఆదేశాలు ఇచ్చేందుకు నిరాకరణ

అక్టోబర్ 26న తదుపరి విచారణకు అవకాశం



న్యూఢిల్లీ: నిరసనలు తెలిపే హక్కుతో పాటు వ్యాపారుల జీవనోపాధిని కూడా కాపాడాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ మూసివేత, నిరసనల నేపథ్యంలో వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంలో తక్షణ ఆదేశాలు జారీ చేసేందుకు నిరాకరించింది.

వ్యాపారుల జీవనోపాధిపై ఆందోళన

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం ఈ అంశంపై స్పందించింది. నిరసన తెలిపే హక్కు, శాంతిభద్రతల పరిరక్షణ, చిన్న వ్యాపారుల జీవనోపాధి వంటి అంశాలన్నీ పరస్పరం సంబంధం కలిగి ఉన్నాయని పేర్కొంది. పండుగల సీజన్‌లో చిన్న వ్యాపారులు సంపాదించే ఆదాయం వారికి, వారి కుటుంబాలకు ఎంతో ముఖ్యమని అభిప్రాయపడింది.

నష్టంపై తగిన సమయంలో స్పందిస్తాం

నిరసనల కారణంగా వ్యాపారులకు నష్టం జరిగి, సంబంధిత చర్యలు చట్టవిరుద్ధమైనవిగా తేలితే రాజ్యాంగ పరిధిలో

తరువాయి 2వ పేజీలో...

అర్బన్ కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలు

- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 16(ప్రజా కలం)

జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ. 2.77 కోట్ల నిధులతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం,

తరువాయి 2వ పేజీలో...

రైతులు ఆరుతడి పంటలపై

దృష్టి సారించాలి

ఎల్ నినో ప్రభావంతోనే సాగునీటి కొరత

క్రమం తప్పకుండా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రూ.63 లక్షల విలువైన చెక్కుల అందజేత

ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు



పెద్దపల్లి,అక్టోబర్16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను

2లో

హ్యుందాయ్ మెగా ప్లాన్! రైతులకు కష్టాలు తప్పవా?

మొదటి పేజీ తరువాయి...

ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫాక్చరింగ్ జోన్‌లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. 678 ఎకరాల్లో విడతలవారీగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే కొద్ది నెలల్లోనే ఆర్ అండ్ డీ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి... అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హ్యుందాయ్ సంస్థకు హైదరాబాద్‌తో రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు మద్దతునిస్తూ కీలక ఆర్‌అండ్‌డీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సామర్థ్యాలను మరింత విస్తరించేలా జహీరాబాద్‌లో గ్లోబల్ ఆర్‌అండ్‌డీ, మెగా టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రం ద్వారా వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు, ధ్రువీకరణ, నాణ్యతా ప్రమాణాల పరిశీలనతోపాటు ఇంజినీరింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం కలగనుంది. హ్యుందాయ్ అధునాతన సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. దేశంలో తెలంగాణ భౌగోళికంగా మధ్యలో ఉందని, హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కలిగిన నగరమని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోని ఆరు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలతో పోలిస్తే హైదరాబాద్ సురక్షితమైన, జీవించడానికి అనుకూలమైన కాస్మోపాలిటన్ నగరంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. కార్ల తయారీ పరిశ్రమకు అవసరమైన రవాణా, మౌలిక సదుపాయాలు తెలంగాణలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాలతోపాటు భవిష్యత్తులో ఓడరేవులకు హైస్పీడ్ కనెక్టివిటీ కల్పించే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్ల అభివృద్ధితో వాహన తయారీ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. పెరి-అర్బన్ రీజియన్ వంటి ప్రణాళికల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, తయారీ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ అనువైన వేదికగా నిలుస్తుందని సీఎం వివరించారు. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 2024 ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. అనంతరం 2025 జూన్‌లో హ్యుందాయ్ ఆర్‌అండ్‌డీ కేంద్రం ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారీ శాటిలైట్ నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సీఎం హ్యుందాయ్ ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేస్తూ, రాబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని సంస్థ యాజమాన్యాన్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను అంతర్జాతీయ సాంకేతిక, అధునాతన ఇంజినీరింగ్ కేంద్రంగా మరింత బలోపేతం చేయాలన్న హ్యుందాయ్ లక్ష్యం తెలంగాణ రైజింగ్-2047 విజన్‌కు అనుగుణంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యూన్ చో తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో తమ సంస్థ భాగస్వామిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో రోహిత్ వేముల తెలంగాణ బిల్లు

ముసాయిదా సిద్ధం చేయాలి

మొదటి పేజీ తరువాయి...

పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యానికి తావివ్వరాదని సూచించారు. తెలంగాణ సచివాలయంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన రోహిత్ వేముల తెలంగాణ బిల్లుపై క్యాబినెట్ సబ్ కమిటీ రెండో సమావేశం జరిగింది. ప్రతిపాదిత బిల్లు రూపకల్పనకు అనుసరించాల్సిన విధానం, కమిటీ కూర్పు, న్యాయపరమైన అంశాలు, వివిధ వర్గాలతో సంప్రదింపుల ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. విద్యార్థుల హక్కులకు సమర్థవంతమైన రక్షణ కల్పించేలా చట్టాన్ని రూపొందించేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'రోహిత్ వేముల చట్ట రూపకల్పన ప్రక్రియకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ (ఎస్‌సీడీడీ) నాయకత్వం వహించాలని సూచించారు. అవసరమైన సంబంధిత శాఖలు, సంస్థలకు కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని, న్యాయశాఖను భాగస్వామిగా చేర్చాలని స్పష్టం చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, యూజీసీ తదితర సంస్థల భాగస్వామ్యంపై పరిశీలన జరపాలని సూచించారు. కమిటీని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి, ముసాయిదా తయారీకి అవసరమైన కార్యాచరణను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు.

రోహిత్ వేముల తెలంగాణ బిల్లు విషయంలో సమాజంలోని వివిధ వర్గాల నుంచి సమగ్ర సంప్రదింపుల ప్రక్రియ చేపట్టాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయ నిపుణులు, పౌర సమాజ సంస్థలు, విద్యా రంగ నిపుణులు, ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరిపేందుకు ముందుగా జాబితా రూపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు సంబంధించిన అంశాలు, చట్ట అమలులో ఎదురయ్యే సవాళ్లను పరిగణనలోకి తీసుకొని ముసాయిదా సిద్ధం చేయాలని చెప్పారు. ప్రభుత్వ అధికారులతోపాటు నిపుణుల సంస్థల ప్రతినిధుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ అంశాలపై చర్చించిన అనంతరం న్యాయశాఖను కమిటీలో సభ్య శాఖగా చేర్చాలని, అయితే కమిటీకి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నాయకత్వం వహించాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అవసరాన్ని బట్టి ఇతర శాఖలు, నిపుణులు, సంబంధిత సంస్థలతో సంప్రదింపులు జరపాలని సూచించారు. రోహిత్ వేముల తెలంగాణ బిల్లుకు అవసరమైన న్యాయపరమైన, సాంకేతిక అంశాల్లో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సహకారం తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. నిబంధనల రూపకల్పనలో సహకరించేందుకు నల్సార్ విశ్వవిద్యాలయం అంగీకరించినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి ఉప ముఖ్యమంత్రికి వివరించారు. విశ్వవిద్యాలయం నైపుణ్యాన్ని వినియోగించుకుంటూ, సంబంధిత శాఖలు, నిపుణుల సూచనలతో సమగ్ర ముసాయిదాను రూపొందించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం, వివక్షను నిరోధించడం, విద్యాసంస్థల్లో న్యాయబద్ధమైన వాతావరణాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రతిపాదిత చట్టంలో ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశం అభిప్రాయపడింది. చట్టంలోని నిబంధనలు ఆచరణ సాధ్యంగా ఉండటంతోపాటు, వాటి అమలుకు అవసరమైన వ్యవస్థలపై కూడా స్పష్టత ఉండాలని పేర్కొన్నారు. మూడు నెలల్లోగా ప్రాథమిక ముసాయిదాను సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీకి సమర్పించి, తదుపరి పరిశీలనకు వీలుగా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్దిష్ట గడువులో కసరత్తు పూర్తయ్యేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు ఉపయోగపడే సమగ్ర చట్టం రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సవ్యసాచి ఘోష్, సీనియర్ ఐపీఎస్ అధికారి దేవేంద్ర సింగ్ చౌహాన్, ఐఏఎస్ అధికారులు యోగితా రాణా, విజయేంద్ర బోయి, , న్యాయవాది దిశా వడేకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ షేర్లకు కొత్త ఊపు

మొదటి పేజీ తరువాయి...

విప్రో దాదాపు 4 శాతం, ఇన్ఫోసిస్ 3.71 శాతం, TCS 3.19 శాతం మేర లాభపడ్డాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ సైతం ఉదయం ట్రేడింగ్‌లో సుమారు 2.8 శాతం బలపడింది. అయితే, ట్రేడింగ్ సమయంలో ధరల్లో మార్పులు ఉండవచ్చు.

మెరుగైన ఫలితాలతో కొనుగోళ్ల జోరు

టెక్ మహీంద్రా రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను అధిగమించడంతో ఇన్వెస్టర్లలో సానుకూలత పెరిగింది. సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 32.74 శాతం పెరిగినట్లు నివేదికలు వెల్లడించాయి. మెరుగైన ఆర్థిక పనితీరు, డీల్స్‌కు సంబంధించిన అంచనాలు షేరుకు బలాన్నిచ్చాయి.

విప్రో ఆదాయంలో సానుకూల సంకేతాలు

విప్రో కూడా మార్కెట్‌లో ఆకర్షణీయమైన లాభాలను నమోదు చేసింది. సెప్టెంబర్ త్రైమాసిక ఆదాయం విశ్లేషకుల అంచనాలను మించడం కంపెనీ షేరుకు మద్దతునిచ్చింది. గతంలో ఆలస్యమైన కొన్ని పెద్ద డీల్స్ ఖరారయ్యే అవకాశాలపై యాజమాన్యం చేసిన వ్యాఖ్యలు కూడా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించాయి.

అయితే, కొత్త డీల్స్ బుకింగ్స్, రాబోయే త్రైమాసికాల్లో ఆదాయ వృద్ధి వంటి అంశాలపై ఇంకా పరిశీలన అవసరం. తాజా ర్యాలీని కంపెనీ వ్యాపారంలో ఉన్న అన్ని సవాళ్లు తొలగిపోయినట్లుగా భావించకూడదు.

AI పరిణామాలు.. భారత ఐటీ షేర్లపై ప్రభావం

అంతర్జాతీయ మార్కెట్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీల అధిక విలువలు, భారీ పెట్టుబడుల నుంచి ఆశించిన రాబడులపై చర్చలు కొనసాగుతున్నాయి. గ్లోబల్ టెక్నాలజీ షేర్లలో చోటుచేసుకున్న ఒడిదుడుకులు పెట్టుబడిదారుల వ్యూహాలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత ఐటీ కంపెనీల ఆర్థిక ఫలితాలు, ప్రస్తుత విలువలు, భవిష్యత్తు వృద్ధి అవకాశాలను ఇన్వెస్టర్లు మరోసారి అంచనా వేస్తున్నారు. అయితే, అంతర్జాతీయ AI షేర్లలో మార్పులే దేశీయ ఐటీ ర్యాలీకి ఏకైక కారణం కాదు.

కంపెనీల ఫలితాలు, కొత్త ఒప్పందాలు, ఆదాయ అంచనాలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇటీవలి సెషన్లలో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ బలపడటం రంగంపై పెరిగిన కొనుగోళ్ల ఆసక్తిని సూచిస్తోంది.

ఇన్వెస్టర్లు గమనించాల్సిన అంశాలివే!

ఒక్కరోజు భారీ లాభాలు వచ్చినంత మాత్రాన షేర్లలో దీర్ఘకాలిక వృద్ధి ఖాయమని చెప్పలేం. కంపెనీల ఆదాయ వృద్ధి, లాభాల మార్జిన్లు, కొత్త డీల్స్, భవిష్యత్తు వ్యాపార అంచనాలు, ప్రస్తుత షేరు విలువలను పరిశీలించడం ముఖ్యం. మార్కెట్ ఒడిదుడుకులను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవాలి.

వ్యాపారాలకు నష్టం వద్దు

మొదటి పేజీ తరువాయి...

తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ధర్మాసనం సూచించింది. అయితే, ప్రస్తుతం ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని, సంబంధిత అంశాలను తదుపరి విచారణలో పరిశీలించాల్సి ఉందని స్పష్టం చేసింది.

అక్టోబర్ 26న విచారణకు అవకాశం

కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ మూసివేతకు సంబంధించిన ఆదేశాలను సవాలు చేస్తూ వ్యాపారుల తరఫున పిటిషన్ దాఖలైంది. ఈ వ్యవహారంపై తదుపరి విచారణను అక్టోబర్ 26న చేపట్టే అవకాశం ఉందని కోర్టు తెలిపింది. నిరసనల నిర్వహణ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటం, వ్యాపార కార్యకలాపాలకు ఆటంకాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై తదుపరి విచారణలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

సోయా రైతుల కష్టంపై

దళారుల కన్ను!

మొదటి పేజీ తరువాయి...

మార్కెట్ యార్డులో కొనుగోలు చేయాల్సిన పంటను బయట దుకాణాల ద్వారా కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రైతుల నుంచి ముందుగానే తక్కువ ధరకు పంటను ఖరారు చేసుకుని, తేమ శాతం పేరుతో మరింత ధర తగ్గిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. తానూర్ మండలంలోనూ ఇలాంటి కొనుగోళ్లు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో మార్కెటింగ్ అధికారులు తనిఖీలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పట్టించుకునే నాథుడే లేడా?..సోయాబీన్ కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భైంసా వ్యవసాయ మార్కెట్ యార్డులో గిట్టుబాటు ధర కోసం గతంలోనూ రైతులు నిరసనలకు దిగిన సందర్భాలున్నాయి. అయినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలోని ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో కొనుగోళ్లను పర్యవేక్షించాలని, తేమ శాతాన్ని రైతుల సమక్షంలో పరీక్షించాలని, తూకాలను తనిఖీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోళ్లు చేస్తున్నట్లు తేలితే సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు: మార్కెటింగ్ అధికారి

ఈ విషయంపై నిర్మల్ జిల్లా మార్కెటింగ్ ఇన్‌చార్జి ఏడీ గంగును సంప్రదించగా, తమకు ఇప్పటివరకు ఈ తరహా ఫిర్యాదులు అందలేదని తెలిపారు. సంబంధిత తహసీల్దార్లు, ఇతర అధికారులను సంప్రదించి వివరాలు తెలుసుకుంటామని, అక్రమాలు జరిగినట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ పంటను విక్రయించుకోవాలని సూచించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సోయాబీన్ కొనుగోళ్లలో పారదర్శకత తీసుకురావాలని, దళారుల దోపిడీ నుంచి రైతులను కాపాడాలని అన్నదాతలు కోరుతున్నారు.

ధిల్లీ వ్యాఖ్యలు.. తెలంగాణలో పాలనపై విమర్శలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధిల్లీలో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతూనే తెలంగాణలో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టాలని, నీటి కొరతను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ ప్రకటించాలని కోరారు. రైతులు, వ్యవసాయ కూలీలకు భరోసా కల్పించడంతో పాటు యాదాద్రి పవర్ ప్లాంట్ అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావం, నీటి లభ్యత, వ్యవసాయ అవసరాలపై అధికారిక అంచనాలు వెలువడితే రాష్ట్రంలో పరిస్థితి మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. కవిత చేసిన ఆరోపణలు, డిమాండ్లపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

అర్బన్ కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలు

మొదటి పేజీ తరువాయి...

అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే ఉద్దేశంతో రూ.2.77 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా కాలనీలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజల్లో ఇప్పటివరకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందని వారు సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకొని పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అదేవిధంగా కాలనీలోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాల వారికి ప్రార్థనా స్థలాలు ఏర్పాటు చేసే అంశంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిందూ సోదరులకు దేవాలయం, ముస్లింలకు మసీదు, క్రైస్తవులకు ప్రార్థనా మందిరాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కాలనీలో సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్య ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ సమస్య పరిష్కారానికి మొబైల్ టవర్ ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీలో నివసించే ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో బస్సు సర్వీసును ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ తదితర మౌలిక సదుపాయాలతో పాటు ప్రజలకు అవసరమైన ఇతర సౌకర్యాలను కూడా దశలవారీగా కల్పిస్తామని చెప్పారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటూ, ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ అర్బన్ హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కాలనీలో విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు రూ.2.77 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజల రవాణా సౌకర్యార్థం బస్సు సర్వీసును ప్రారంభించడం ద్వారా కాలనీ వాసులకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. కాలనీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో రూ.2.77 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా గృహజ్యోతి పథకం కింద అర్హత ఉన్నప్పటికీ ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందని కుటుంబాలు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలకు విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ వంటి సదుపాయాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటూ, కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, విద్యుత్ శాఖ అధికారులు, హౌసింగ్ అధికారులు, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, తహసీల్దార్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

మొదటి పేజీ తరువాయి...

అర్హులైన లబ్ధిదారులకు క్రమం తప్పకుండా అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు.పట్టణ కేంద్రంలోని ఆర్.కె.గార్డెన్స్‌లో పెద్దపల్లి పట్టణం,మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 63 మంది లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి ఆయన రూ.63 లక్షల విలువైన కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి కొరత ఏర్పడిందని, రైతులంతా ఈ పరిస్థితిని గమనించి వరికి బదులుగా ఆరుతడి,ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. రైతులు పండించిన ప్రత్యామ్నాయ పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చూసే బాధ్యత తనదని ఆయన భరోసా ఇచ్చారు.ఈ సీజన్‌లో పంటలకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో చర్చించి సాగునీరు విడుదల చేయించినట్లు గుర్తుచేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని పేర్కొన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్,ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు,రూ.500లకే గ్యాస్ సిలిండర్,నూతన రేషన్ కార్డులు,ఉచిత సన్నబియ్యం పంపిణీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, తహసీల్దార్,సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు,మున్సిపల్ కౌన్సిలర్లు,పలు గ్రామాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్నాల గ్రామ పంచాయతీలో

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



బెల్లంపల్లి, అక్టోబర్ 16, (ప్రజాకలం) ప్రతినిధి మంచిర్యాల జిల్లా,బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీలో సర్పంచ్ నాతరి మల్లమ్మ,ఉపసర్పంచ్ తోకల సూరమ్మ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందచేశారు .ఈ సందర్భంగా సర్పంచ్ నాతరి మల్లమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. సన్న బియ్యం పంపిణీ, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, వంటి అనేక కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతుందన్నారు. పేదలకు ఎల్లప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుంది అన్నారు.ఈ కార్యక్రమం లో డీలర్ జన్నాన్న, 8వవార్డ్ మెంబర్ భామలపెల్లి స్వామి 4వ వార్డ్ మెంబర్ మంతేన కిరణ్ ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆసంపల్లి నరసయ్య, నాతరి మూర్తి ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు...

నిరుపేద విద్యార్థి వైద్య విద్యకు ఎస్పీఎఫ్ ట్రస్ట్ ఆర్థిక సాయం

ఎంబీబీఎస్ చదువుకు రూ.25 వేల ఆర్థిక సహకారం



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 16(ప్రజా కలం): పేదరికం కారణంగా వైద్య విద్యకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద విద్యార్థికి ఎస్పీఎఫ్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. జగిత్యాల పట్టణానికి చెందిన భోగ విష్ణువర్ధన్‌కు ఎంబీబీఎస్ చదివేందుకు రూ. 25 వేల ఆర్థిక సహకారం అందించింది.విష్ణువర్ధన్ ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించాడు.అయితే అతని తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండటంతో కుటుంబ ఆర్థిక పరిస్థితులు వైద్య విద్యకు అడ్డంకిగా మారాయి.ఈ నేపథ్యంలో విద్యార్థి ఆర్థిక ఇబ్బందులపై పలు వార్తాపత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి.ఈ కథనాలు తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ ఐఏఎస్ దృష్టికి రావడంతో ఆయన స్పందించారు. తన మిత్ర బృందంతో కలిసి నిర్వహిస్తున్న శ్యామ్ ప్రసాద్ లాల్ ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ (ఎస్పీఎఫ్ ట్రస్ట్) ద్వారా విద్యార్థికి సహాయం చేయాలని నిర్ణయించారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ఈ మేరకు శుక్రవారం ఎస్పీఎఫ్ ట్రస్ట్ కన్వీనర్ గోనె శ్రీనివాస్, జగిత్యాల జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ గుగ్గిళ్ల సత్యం, బట్టు హరికృష్ణ తదితరులు జగిత్యాలకు చేరుకుని, జిల్లా అదనపు కలెక్టర్ ప్రసూనాంబ చేతుల మీదుగా విష్ణువర్ధన్‌కు రూ. 25 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రసూనాంబ విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి మంచి వైద్యుడిగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

బెల్లంపల్లి శ్రీ బంగారు మైసమ్మ-పోచమ్మ తల్లి

ఆలయంలో మహాచండీ యాగం



బెల్లంపల్లి, అక్టోబర్ 16, (ప్రజాకలం) ప్రతినిధి...మంచిర్యాల జిల్లా,బెల్లంపల్లి పట్టణంలోని శ్రీ బంగారు మైసమ్మ-పోచమ్మ తల్లి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ గెల్లి రాజలింగు యాదవ్ ఆహ్వానం మేరకు శ్రీమాత మహాచండీ యాగం కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.వేద పండితుల మంత్రోచ్చారణలు, పవిత్ర యాగాగ్ని సాక్షిగా నిర్వహించిన ఈ మహాచండీ యాగంలో పాల్గొన్న నాయకులు అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరి పై ఉండాలని,బెల్లంపల్లి సుఖ సంతోషాలు,అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్,మున్సిపల్ చైర్ పర్సన్ దావా స్వాతి ,రమేష్ బాబు, అధికార ప్రతినిధి దేవసాని ఆనంద్, జనరల్ సెక్రెటరీ దెబ్బటి రమేష్, మాజీ పట్టణ అధ్యక్షులు కంకటి శ్రీనివాస్,నాయకులు బండి లక్ష్మణ్,పీక లక్ష్మణ్ ,గెల్లి రమాకాంత్ యాదవ్ పాల్గొన్నారు...

బీజేపి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా దుర్గం నియామకం



ఎండపల్లి, అక్టోబర్ 16 : (ప్రజా కలం ప్రతినిధి) బీజేపి జిల్లా ఎస్సి మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన దుర్గం రమేష్ నియమితు లయ్యారు. ఈ సందర్భంగా తన నియమానికి సహక రించిన జగిత్యాల జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఓరగంటి చంద్ర శేఖర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు, ఎండపల్లి మండల అధ్యక్షులు రావు హనుమంతరావు కు బీజేపి సభ్యులందరికీ ధన్య వాదాలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని దుర్గం రమేష్ తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను, వైద్య పరికరాలు, కార్డులు, రిజిస్టర్లు, వివిధ విభాగాలు, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, చిన్నారుల చికిత్స విభాగం, ఐసియూ గదులను, పడకలు, పిల్లల విభాగంలో ఏసీలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి ప్రతిరోజూ వచ్చే ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, వారి బరువు, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించే విధంగా వైద్యులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోగులకు వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ఇంకా సదుపాయాలు, వైద్య పరికరాలు, ఏసీలు ఇతరత్రా అవసరం ఉన్నట్లయితే వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలని, మరమ్మతులకు గురైనట్లయితే వెంటనే మరమ్మతులు చేయించాలని, రోగులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రి అధికారులు కోరిన అవసరమైన సదుపాయాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం సేవించి వచ్చి గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అటువంటి ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రశాంతమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ రోగులు, వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. అశోక్ కుమార్, ఆర్ఎంఓ డా. శ్రీధర్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

నాన్ కెడస్ట్రాల్ రిసర్వే, ఎంజాయ్మెంట్ రీ సర్వే పనుల పరిశీలన

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 16 (ప్రజా కలం)

మెట్ పల్లి మండలంలోని మేడిపెల్లి గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే, ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, వకడ్బందీగా చేవట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది, ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే సంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సూచించారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ– సర్వే నిర్వహిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీవో నరసింహ రావు, తహసీల్దార్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మండలం ఘనంగా దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు

- పలు గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మద్దుల

ఎండపల్లి, అక్టోబర్ 16 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని పలు గ్రామాలలో భక్తిశ్రద్ధలతో అమ్మవారి మండపాల సందర్శన పాతగూడూర్ లో అన్నప్రసాద వితరణలో పాల్గొన్న గోపాల్ రెడ్డి. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం రోజున ఉదయం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి పలు గ్రామాల్లోని దుర్గా దేవి మండపాలను సందర్శించి అమ్మవారిని దర్శించు కున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఎండపల్లి మండలంలోని ముంజంపల్లి, గొడిశెలపేట, పడకల్, కొత్తపేట, చర్లపల్లి, గుల్లకోట, పాతగూడూర్, రాజారాంపల్లి గ్రామాల్లో, వెల్గటూర్ మండలం పైడిపల్లి గ్రామం లో నిర్వహిస్తున్న దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయన పర్యటించారు. ప్రతి గ్రామం లోని అమ్మవారి మండపానికి చేరుకున్న గోపాల్ రెడ్డి ఆయా గ్రామాల పురోహితులు, నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు గెల్లు చంద్ర శేఖర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు సంఘ రమేష్ యాదవ్, బాలసాని మల్లేశం గౌడ్, బెడ్డల ప్రవీణ్, జీ రెడ్డి మహేందర్ రెడ్డి, పడిధం మొగిలి, గొల్లపెల్లి మల్లేశం గౌడ్, కొంగల జగదీశ్వర్ రెడ్డి, గొల్లపెల్లి సత్యం గౌడ్, గాజుల లక్ష్మణ్, గాజుల విజయ్, గెల్లు శ్రీనివాస్, రాజు, ఏలేటి చంద్రారెడ్డి, కుంట మల్లా రెడ్డి, వెంకటస్వామి, పొట్లపల్లి సత్య రావు, రాకేష్, అరుణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, అశోక్, సురేష్, రాజు, వంశీ, దిలీప్, శేఖర్, సంతోష్, వెంకటేష్, రఘువర్ధన్, పాల్గొన్నారు.



జగ్గసాగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- మెట్ పల్లి మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వేడుకలు



మెట్ పల్లి రూరల్ , అక్టోబర్ 16:(ప్రజా కలం);మెట్ పల్లి మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జగ్గసాగర్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వైద్యాధికారులు డాక్టర్ వొంటెల వాణి రెడ్డి, డాక్టర్ శివాని రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతిపై ప్రేమకు, ఐకమత్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌సెంటర్ వైద్య సిబ్బంది, సీహెచ్ఓ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్లు రమేశ్, జగన్నాథం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయులు జంగం విజయ్ కన్నుమూత

టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రగాఢ సంతాపం



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 16(ప్రజా కలం): మెట్‌పల్లి పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు జంగం విజయ్ అనారోగ్యంతో కన్నుమూశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో మెట్‌పల్లి పాత్రికేయ రంగంలో విషాదం అలుముకుంది. సుదీర్ఘకాలంగా పాత్రికేయ రంగంలో సేవలందించిన జంగం విజయ్ మృతి పట్ల జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నా చర పాత్రికేయుడిని కోల్పోవడం బాధాకరమని, ఆయన మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బూరం సంజీవ్, కార్యదర్శి మహమ్మద్ అజీమ్ మాట్లాడుతూ జంగం విజయ్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

జంగం విజయ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన కుటుంబానికి తమ సంఘం అండగా ఉంటుందని, వారి దుఃఖంలో భాగస్వాములమవుతామని తెలిపారు. జంగం విజయ్ మృతి పట్ల టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

సమాన పనికి సమాన వేతనం.. ఉద్యోగ భద్రత కల్పించాలి

నిరవధిక సమ్మెకు బీజేపీ నేత డాక్టర్ భోగ శ్రావణి సంఘీభావం



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 16(ప్రజా కలం):

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు ఆమె గురువారం సంఘీభావం ప్రకటించారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా ఎన్‌హెచ్ఎం పరిధిలో పనిచేస్తూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను విస్మరించడం సరికాదన్నారు.ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెరుగుతున్న పని భారాన్ని, ఒత్తిడిని తగ్గించి, వర్తించే అలవెన్సులు అందించాలని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించి, వారి హక్కులకు గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డాక్టర్ భోగ శ్రావణి విజ్ఞప్తి చేశారు.

పంటల కొనుగోలు ప్రక్రియకు లారీల

యజమానులు సహకరించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 జిల్లాలో పత్తి, వరి తదితర పంటల కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు లారీల యజమానులు, జిల్లా లారీ అసోసియేషన్ ప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పంటల కొనుగోలు కేంద్రాల నుంచి పంటలను తరలించే రవాణా ప్రక్రియలో, కొనుగోలు కేంద్రాల వద్ద లారీలను అందుబాటులో ఉంచడం, అవసరమైన సమయంలో రవాణా సదుపాయాలు కల్పించడం వంటి అంశాలలో లారీల యజమానులు సహకరించాలని, పంటల కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పంటల కొనుగోలు, రవాణా ప్రక్రియలు నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియకు ఆటంకాలు కలిగించినట్లయితే సంబంధిత వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. పంటల కొనుగోలుకు అవసరమైన రవాణా సదుపాయాలను సమకూర్చే క్రమంలో, అవసరాన్ని బట్టి ఇతర ప్రాంతాల నుంచి లారీలను జిల్లాలోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా లారీ అసోసియేషన్ ప్రతినిధులు, లారీల యజమానులు జిల్లా యంత్రాంగానికి సహకరిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు.

రెండు రోజుల పాటు తగ్గనున్న తాగునీటి సరఫరా



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 16 (ప్రజాకలం):-మెట్‌పల్లి పట్టణంలో ఈ నెల 17, 18 తేదీల్లో తాగునీటి సరఫరా కొంతమేర తగ్గే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు సంబంధించిన గేట్‌వాల్వ్ మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు పట్టణ ప్రజలకు తక్కువ పరిమాణంలో నీరు సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు.ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, రెండు రోజుల పాటు మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే తాగునీటి సరఫరాను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ప్రజా కలం
శనివారం, అక్టోబర్ 17, 2026

సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం

తమిళనాడు రాజకీయ వేదికపై దశాబ్దాలుగా నడుస్తున్న సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం కనిపిస్తోంది. ఒకప్పుడు ద్రవిడ ఆత్మగౌరవం, ప్రాంతీయ స్వయంప్రతిపత్తి , హిందీ వ్యతిరేక నినాదాలతో జాతీయ పార్టీలను, ముఖ్యంగా కాషాయ రాజకీయాలను నిరంతరం శత్రువుగా చిత్రీకరించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఆయన తమిళనాడులో అడుగుపెట్టిన ప్రతిసారీ విపక్షాలు, తమిళ జాతీయవాద సంఘాలు గో బ్యాక్ మోదీ నినాదాలతో విరుచుకుపడేవి. నల్లజెండాలు, ఆకాశంలోకి ఎగిరే నల్ల బెలూన్లు ప్రధాని పర్యటనలకు నిరసన కాన్వాయ్‌లుగా మారిన రోజులను తమిళనాడు చూసింది. కానీ, ల చెన్నై మెట్రో ఫేజ్-2 ప్రారంభోత్సవంతో పాటు రూ. 13,000 కోట్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రధాని మోదీ పర్యటించిన తీరును వరిశీలిస్తే, రాష్ట్రీయ రాజకీయ నమీకరణాలు పూర్తిగా మారిపోయాయన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ సారి ప్రధాని పర్యటన వేళ గాలిలో నల్ల బెలూన్లు కానీ, రోడ్లపై భయానక నిరసనలు కానీ ఎక్కడా కనిపించలేదు. రాష్ట్రంలో రవాణా, విద్య, పరిశోధన, మౌలిక వసతుల రంగాలు వేగంగా పుంజుకునేలా రూ. 13,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి ప్రధాని ఇక్కడికి వచ్చారు. ఇందులో ప్రధానంగా చెన్నై మెట్రో ఫేజ్-2 మార్గం ప్రారంభోత్సవంతో పాటు ఐఐటీ మద్రాస్ బ్రెయిన్ సెంటర్ నందర్శన లాంటి కీలక అధికారిక కార్యక్రమాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీతో కలిసి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అటు పరిపాలన పరంగా, ఇటు రాజకీయ వర్గాల్లో ఈ భేటీ సరికొత్త చర్చకు దారితీసింది. రాజకీయ వైరుధ్యాలు పక్కనబెట్టి, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రధానితో ఒకే వేదికను పంచుకోవడమే కాకుండా, మెట్రో రైలులో పక్కపక్కనే కూర్చుని ప్రయాణించడం తమిళనాడు క్షేత్రస్థాయి రాజకీయాల్లో వచ్చిన గుణాత్మక మార్పునకు అద్దం పడుతోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కేంద్ర పెద్దల పర్యటనను నిరసనలతో హోరెత్తించే సంస్కృతి స్థానంలో ఇప్పుడు సంయమనం, పరస్పర గౌరవం చోటుచేసుకున్నాయి. తమిళ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా ట్రెండ్స్‌ను విశ్లేషిస్తే.. తమిళ ప్రజల ఆలోచనా విధానంలో కూడా గణనీయమైన మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ఉచితాలు , సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి , మౌలిక వసతుల కే తమిళ యువత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. చెన్నై మెట్రో విస్తరణ, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, పారిశ్రామిక హబ్‌లకు కేంద్ర నిధులు అత్యంత ఆవశ్యకమని భావిస్తున్న నేపథ్యంలో, అనవసరమైన రాజకీయ ద్వేషం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందనే అభిప్రాయం తమిళ నెటిజన్లలో వ్యక్తమవుతోంది. తమిళనాడు రాజకీయ రంగాన కొత్తగా ఆవిర్భవించిన పొలిటికల్ శక్తులు , మారిన ద్రవిడ కూటముల వ్యూహాలు కూడా ఈ మార్పునకు కారణమయ్యాయి. బీజేపీపై కేవలం రొటీన్ ఆరోపణలతో ఇకపై ఓటు బ్యాంకును నిలబెట్టుకోలేమని గ్రహించిన ప్రధాన ద్రవిడ పార్టీలు, వ్యూహాత్మకంగా తమ ఘర్షణ వైఖరిని తగ్గించుకున్నాయి. ప్రధాని మోదీ సైతం తన ప్రసంగాల్లో తిరుక్కురళ్ పద్యాలను, తమిళ సంస్కృతి, భారతీయార్ కవితలను నిరంతరం ప్రస్తావిస్తూ తమిళ భాషాభిమానాన్ని ఆకట్టుకునేందుకు చేస్తున్న నిరంతర ప్రయత్నాలు కాషాయంపై ఉన్న సైకలాజికల్ భయాన్ని గణనీయంగా తగ్గించాయి. ఈ మార్పు వెనుక ఉన్న మరో ముఖ్యమైన రాజకీయ కోణం.. జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలకు మారుతున్న అవసరాలు. ఒకప్పుడు బీజేపీని అంటరాని పార్టీగా చూసిన ద్రవిడ నేతలు ఇప్పుడు కేంద్రంతో సత్సంబంధాలు నెరపడం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి నిధులు తెచ్చుకోగలమని భావిస్తున్నారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో బీజేపీ వేగంగా పుంజుకోవడం, ఓటు బ్యాంకును విస్తరించుకోవడంతో నేరుగా కాషాయ శ్రేణులతో విభేదించడం కంటే రాజకీయ పోటీని ప్రజాసమస్యలపైకి మళ్లించడమే ఉత్తమమని స్థానిక నాయకత్వాలు నిర్ణయించుకున్నాయి. ఒకప్పుడు తమిళనాడు రాజకీయాల్లో విజయానికి మార్గంగా ఉన్న కాషాయ వ్యతిరేకత , బీజేపీ ద్వేషం ఇప్పుడు క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతోంది. నల్ల బెలూన్ల స్థానంలో అభివృద్ధి భాగస్వామ్యానికి ప్రాధాన్యమిచ్చే నయా రాజకీయ శకం తమిళ నేలలో ప్రారంభమైంది. రాబోయే ఎన్నికల్లో కేవలం భావోద్వేగాలు, ద్రవిడ సెంటిమెంట్లు మాత్రమే కాకుండా, సంక్షేమం , మౌలిక వసతుల రూపకల్పనే గెలుపోటములను నిర్ణయించే ప్రధాన అంశంగా మారబోతోంది.

జనసేన నాయకుడు అజయ్ కి సన్మానం

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 16 (ప్రజాకలం):- దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జనసేన పార్టీ కోరుట్ల నియోజకవర్గ నాయకుడు గంగం అజయ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక వాసవీమాత ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ గంగం అజయ్ కుమార్ ఆర్యవైశ్య సంఘానికి, వాసవీమాత ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు కోట కిరణ్, జొన్నల శ్రీను, బండారి గోపి, పుల్లూరి నవీన్, చాడ చందు, ఎలిమి రవి, వాసవీమాత ఆలయ కమిటీ సభ్యులు, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పంటలను కాపాడేందుకే ఎస్సారెస్పీ నీటి విడుదల

- ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు



పెద్దపల్లి,అక్టోబర్ 16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రైతుల సంక్షేమం,వారి పంటల పరిరక్షణే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. పెద్దపల్లి, రామగుండం,మంథని నియోజకవర్గాలకు డీ-83, డీ-86 ప్రధాన కాలువల ద్వారా అందుతున్న సాగునీటి సరఫరా తీరును శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి ప్రధాన కాలువ వద్ద ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువల ద్వారా నీటి విడుదల వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ ప్రస్తుతం పంటలకు చివరి తడులు అందించాల్సిన కీలక సమయమని,ఈ దశలో నీరు అందకపోతే అన్నదాతలు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.రైతుల ఇబ్బందులను గమనించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో చర్చించి ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదలకు అనుమతి సాధించినట్లు తెలిపారు.నీటి లభ్యత పరిమితంగా ఉన్నప్పటికీ,రైతుల ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యమిచ్చి ప్రభుత్వం సాగునీరు అందిస్తోందని వివరించారు.సాగునీటి అంశంపై ప్రతిపక్షాలు క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోకుండా అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విజయరమణారావు మండిపడ్డారు.రాజకీయ లబ్ధి కోసమే అసత్య విమర్శలు చేయడం తగదని, రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యతను ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వర్తిస్తోందని పేర్కొన్నారు.రైతుల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ నిరంతరం కృషి చేస్తారని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లు,సింగిల్ విండో చైర్మన్లు, సర్పంచ్‌లు,మండల,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,అక్టోబర్ 16:(ప్రజాకాలం జిల్లాప్రతినిధి)

రామగుండం నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నగరంలో విస్తృతంగా పర్యటించి పలు నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రామగుండం-లింగాపూర్ రహదారి పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు,పైపులైన్ల మార్పిడిని వెంటనే పూర్తి చేయాలని సూచించారు.ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న నూతన ఆసుపత్రి భవనాన్ని జనవరి 15 నాటికి,నర్సింగ్ కళాశాల భవనాన్ని ఫిబ్రవరి నాటికి అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు.ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యులు ఉన్నందున శస్త్రచికిత్సల సంఖ్యను పెంచి పేదలకు మెరుగైన వైద్యం అందించాలని,పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.36వ డివిజన్‌లో జీవో 76 దరఖాస్తులను, సింగరేణి భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్టోబర్ 25లోగా ధ్రువీకరణ పూర్తి చేయాలన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అదనపు తరగతి గదుల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం మంథని మండలం చిల్లపల్లిలో మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో నడుస్తున్న సోలార్ ప్లాంట్‌ను పరిశీలించి, పూర్తిస్థాయి విద్యుత్ సరఫరా కోసం రూ. 28 లక్షల అంచనా వ్యయంతో ప్రత్యేక లైన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.ఈ పర్యటనలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పేద రోగులకు వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

డాక్టర్ మారం తిరుపతి యాదవ్ - వాలంటీర్లకు వెన్నుదన్నుగా యాదవ చారిటబుల్

కలెక్టర్ చేతుల మీదుగా వేతనాల పంపిణీ



పెద్దపల్లి,అక్టోబర్ 16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో గత 15 నెలలుగా నిరుపేద రోగులకు విశేష సేవలందిస్తున్న వాలంటీర్లకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా గౌరవ వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేదలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడడంలో వాలంటీర్ల నిస్వార్థ కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న వారి అంకితభావాన్ని గుర్తించి సమాజం తరఫున వెన్నుతట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వారిలో మరింత ఉత్సాహాన్ని,బాధ్యతాయుతమైన పనితీరును పెంపొందించేందుకే ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తున్నామని స్పష్టం చేశారు.కేవలం వైద్య రంగానికే కాకుండా, ప్రజా సంక్షేమమే పరమావధిగా యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని విస్తృత సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి సామ తిరుపతి యాదవ్‌తో పాటు ఆసుపత్రి వాలంటీర్లు,తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పైరు బతకాలి.. ప్రతి రైతు గెలవాలి

రైతుల మధ్య చిచ్చు పెట్టొద్దు -కాలువలోకి దిగి నీటిని వదిలిన బీఆర్ఎస్ నేత ఉప్పు రాజ్‌కుమార్



పెద్దపల్లి,అక్టోబర్ 16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి పరిధిలోని డి-83 మైనర్ 20-ఆర్ కాలువలో ఎగువ ప్రాంత రైతులు రేకులు,గడ్డి,రాళ్లతో కల్వర్టును మూసివేయడంతో దిగువ ఆయకట్టుకు నీరు నిలిచిపోయి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడగా అధికారులకు తెలిపినా ఫలితం లేకపోవడంతో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ స్వయంగా రంగంలోకి దిగారు.రైతుల విజ్ఞప్తి మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఆయన,ఎగువ రైతులతో మాట్లాడి సమస్యను సద్దుమణిగేలా చేయడమే కాకుండా,స్వయంగా కాలువలోకి దిగి కల్వర్టుకు అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించి దిగువకు సాగునీటి ప్రవాహాన్ని పునరుద్ధరించారు.ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఎగువ,దిగువ అనే తేడా లేకుండా ప్రతి పొలానికి నీరంది రైతుల పంటలు దక్కాలన్నదే తమ ధ్యేయమని స్పష్టం చేస్తూ,ప్రభుత్వ నిర్లక్ష్యం,కాలేశ్వరం జలాల సక్రమ నిర్వహణ లోపం వల్లే అన్నదాతలకు ఈ కష్టాలు వచ్చాయని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో చివరి ఆయకట్టు వరకు నీరందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు గంగుల సతీష్, కుమ్మరి మల్లేశం,బొగ్గుల మోహన్,షేర్ రాజయ్య,తుమ్మల శ్రీనివాస్,బండి రాజేశం, పెరక శంకర్,శిరవేణి కనకయ్య,బట్టు అంజి,బద్దిపల్లి నర్సయ్య,బుజ్జయ్య, సొల్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

కోటిలింగాలను సందర్శించిన జిల్లా కలెక్టర్..

వెల్గటూర్, సెప్టెంబర్ 16, ప్రజాకలం, ప్రతినిధి : జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలంలోని కోటిలింగాలను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ఇక్కడ చేపడుతున్న అభివృద్ధి పనులు, ఆలయ పునర్నిర్మాణ పనులను తొదరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గోదావరి పుష్కరాల సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ధర్మపురి, కోటిలింగాలలో గల ఆలయాల పునర్నిర్మాణానికి ప్రభుత్వం పూనుకొని భారీగా నిధులను కేటాయించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మధుసూదన్, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈ ఈ రాజేశం, ఏఈ సంతోష్ రెడ్డి, ఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్ ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు




శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

రౌడీ షీటర్లకు కోరుట్ల సీఐ కొమ్ము తిరుపతి



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి, అక్టోబర్ 16(ప్రజా కలం): దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొమ్ము తిరుపతి తెలిపారు. సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన, పండుగ నేపథ్యంలో కోరుట్ల పట్టణ పరిధిలోని రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. నేర ప్రవర్తనను విడనాడి సాధారణ పౌరులుగా జీవించాలని హితవు పలికారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ఘర్షణలకు దిగినా కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ దసరా పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకునేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎస్ఐ జి. శ్యామ్‌రాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు..



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 16(ప్రజా కలం ప్రతినిధి)

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ప్రతిష్టించిన అమ్మవారి ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుజువ్వడి కృష్ణారావు ఈరోజు దర్శించుకున్నారు ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో కృష్ణారావుతోపాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి సునీతసుగుణకర్ రావు మండలంలోని సర్పంచులు మాజీ సర్పంచ్ లు మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాలో ఉన్న నాయకులు యువజన కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ ఎం ఎస్ యు ఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి

జువ్వాడి నర్సింగరావు, మైలారపు లింబాద్రి



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 16 (ప్రజాకలం):-

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మెట్‌పల్లి పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించే సాంప్రదాయ శమీ పూజ (జమ్మి పూజ) ప్రాంగణాన్ని, బతుకమ్మ నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్‌ను తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. శమీ పూజకు వచ్చే భక్తులకు, బతుకమ్మ నిమజ్జనంలో పాల్గొనే మహిళలకు సౌకర్యాలు కల్పించాలని, భద్రతా చర్యలు పటిష్ఠంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెట్ పల్లి త్రిశక్తి ఆలయంలో ఘనంగా కుంకుమ పూజ

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 16 (ప్రజాకలం):- నవరాత్రుల సందర్భంగా మెట్టుపల్లి పట్టణంలోని త్రిశక్తి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ధ్యావనపెల్లి రాజారాం ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించి, ఓడిబియ్యంతో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని భక్తులు ప్రార్థించారు. దింతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.



గుల్లకోట విద్యుత్తు లైన్ ఫీడర్ నుండి
ఎండపల్లి ఫీడర్ కు మార్పు



ఎండపల్లి, అక్టోబర్ 16 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని గుల్లకోట 11 కెవి విద్యుత్ ఉపకేంద్రం గుల్లకోట ఫీడర్ పై ఎక్కువ ట్రాన్స్ఫార్మర్లు ఉన్నందున లోడు ఆగక ట్రిప్ అవుతుందని అదనంగా 5 విద్యుత్ ఫోల్లు వేసి గుల్లకోట ఫీడర్ నుండి ఎండపల్లి ఫీడర్ కు కొన్ని ట్రాన్స్ఫార్మర్లు మార్చినట్లు ఏఈ బండి సమ్మయ్య తెలిపారు. రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చేసినందుకు గుల్లకోట రైతులు హర్షం వ్యక్తం చేశారు రైతులు సాన మారుతి, పొన్నం తిరుపతి, గుండ గంగయ్య, జల్లెళ్ల కనకయ్య, బుర్ర సాయి, జక్కుల రాజయ్య, రైతులు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ బండి సమ్మయ్య, లైన్మెన్ బండి రమేష్, లైన్ ఇన్స్పెక్టర్ రవి, చెన్న మహేందర్, రాజు, రవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఏఈ బండి సమ్మయ్యను గ్రామ రైతులు అభినందించారు.

బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో
ఘనంగా బతుకమ్మ వేడుకలు

సద్దుల బతుకమ్మ వేడుకల్లో సందడి చేసిన మహిళా కౌన్సిలర్స్, మెప్మా సిబ్బంది



బెల్లంపల్లి, అక్టోబర్ 16, (ప్రజాకలం)ప్రతినిధి.. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.పట్టణ మహిళా కౌన్సిలర్స్,మెప్మా సిబ్బంది రంగు రంగు పూలతో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు మాట్లాడుతూ సాక్షాత్తు గౌరమ్మ ప్రత్యక్షమైనట్టుగా బతుకమ్మను మెప్మా సిబ్బంది పేర్చారని,తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తోటి కౌన్సిలర్స్, మెప్మా సిబ్బందితో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈనెల 20న జరిగే రామ్ లీలా కార్యక్రమంలో భక్తులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు..

విదేశీ విద్యానిధి దరఖాస్తు గడువు పొడిగింపు

- అక్టోబర్ 31 వరకు అవకాశం - జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎం.రవీందర్

పెద్దపల్లి,అక్టోబర్16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకం దరఖాస్తుల తుది గడువును ఈ నెల 31వరకు పొడిగించినట్లు పెద్దపల్లి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎం.రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాలలో మాస్టర్స్ లేదా డాక్టోరల్ విద్యను అభ్యసించాలనుకునే అర్హులైన బీసీ,ఈబీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండి,35 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు దీనికి అర్హులని, డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులతో పాటు జీఆర్ఈలో 260 లేదా జీమ్యాట్లో 500 మార్కులు,అలాగే టోఫెల్లో 60,అంతర్జాతీయ ఆంగ్ల భాషా నైపుణ్య పరీక్షలో 6.0 లేదా పీటీఈలో 50 స్కోరు సాధించి ఉండాలని స్పష్టం చేశారు.అర్హత గల విద్యార్థులు పూర్తి వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం http://www.telanganaepass.cgg.gov.in వెబ్సైట్ను సందర్శించాలని ఆయన సూచించారు.



కంకి నల్లితో వరి దిగుబడికి ముప్పు

- సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి
- రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ ఓదెల

పెద్దపల్లి,అక్టోబర్ 16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) వరి పంటలో కంకి నల్లి ఉధృతి పెరిగే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండి తగిన నివారణ చర్యలు చేపట్టాలని రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త,ఎల్నినో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సంపత్ ఓదెల శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.ఈ కంకి నల్లి ఆశిస్తే ఆకుల ఈనెలపై,ఆకు తొడుగులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడటంతో పాటు కంకి బయటకు వచ్చే దశలో గింజలు సరిగా నిండక పొల్లుగా, నల్లగా మారి దిగుబడి తీవ్రంగా తగ్గుతుందని ఆయన హెచ్చరించారు.దీని నివారణకు రైతులు గరిష్ఠ పిలకల దశ నుంచి కంకి దశ వరకు పొలాన్ని నిరంతరం గమనిస్తూ,కలుపు మొక్కలను తొలగించి, నత్రజని ఎరువులను పరిమితి మేరకే సమతుల్యంగా వేసుకోవాలని పేర్కొన్నారు.రసాయన యాజమాన్యం కింద లీటరు నీటికి స్పైరోమెసిఫెన్ 1 మి.లీ.లేదా డైకోఫాల్ 5 మి.లీ.చొప్పున ఏదో ఒక మందును మాత్రమే పిచికారీ చేయాలని, రెండు మందులను ఎట్టిపరిస్థితుల్లోనూ కలపకూడదని స్పష్టం చేస్తూ,మోతాదుల విషయంలో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులు లేదా శాస్త్రవేత్తలను సంప్రదించాలని కోరారు.



ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందేలా చర్యలు

ప్రజల్లో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
ఆసుపత్రుల్లో పటిష్ట అగ్నిప్రమాద నివారణ వ్యవస్థ ఉండాలి



నిర్మల్ అక్టోబర్ 16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్న నమ్మకం కలిగేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శుక్రవారం భైంసా పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది వివరాలతో పాటు ప్రతిరోజూ నమోదయ్యే ఓపీ, ఇన్పేషెంట్ విభాగంలో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య, అందిస్తున్న వైద్య సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిర్దిష్ట సమయానికి విధులకు హాజరై రోగులకు నిరంతరాయంగా సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించిన కలెక్టర్, అన్ని వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని ఆదేశించారు. డయాలసిస్ కేంద్రం, నవజాత శిశువుల విభాగం, రక్త పరీక్షల గది, మందుల గదితో పాటు ఇతర విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన రోగ నిర్ధారణ పరీక్షలను సకాలంలో నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వైద్య సేవలు, మందులు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో పటిష్టమైన అగ్నిప్రమాద నివారణ వ్యవస్థ అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అగ్నిమాపక పరికరాలను పరిశీలించి, వాటి పనితీరు, గడువు తేదీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో 24 గంటలూ సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీలో డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ శశిభూషణ్, మున్సిపల్ కమిషనర్ సంతోష్, ఇతర అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్ఫార్మర్ సమీపంలో పశువు మృతి

కార్వంగ గ్రామం గుండ్రటి కుంట పరిధిలో ఘటన.. విద్యుత్ భద్రతా చర్యలు చేపట్టాలని రైతుల విజ్ఞప్తి

తెల్కపల్లి, నాగర్కర్నూల్ అక్టోబర్ 16 (ప్రజా కలం):

తెల్కపల్లి మండలం కార్వంగ గ్రామంలోని గుండ్రటి కుంట పరిధిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ సమీపంలో పశువు మృతి చెందిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయ పొలాల సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ వద్ద పశువు మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఈ ఘటనకు విద్యుత్ షాక్ కారణమా, మరేదైనా కారణమా అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

విద్యుత్ పరికరాల భద్రతపై ఆందోళన

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. పొలాల పరిసరాల్లో పశువులు మేత మేస్తూ తిరుగుతుంటాయని, ఈ క్రమంలో విద్యుత్ పరికరాల వద్ద ఏదైనా లోపం ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. కార్వంగ గ్రామంలోని గుండ్రటి కుంట పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, సంబంధిత ట్రాన్స్ఫార్మర్ను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ట్రాన్స్ఫార్మర్ పరిసరాల్లో విద్యుత్ వైర్లు, ఇతర పరికరాల పరిస్థితిని తనిఖీ చేసి, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలి...వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతులకు పశువులు ఎంతో విలువైన ఆస్తి. పశువులకు ఏదైనా ప్రమాదం జరిగితే రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లోని ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ లైన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కార్వంగ గ్రామం గుండ్రటి కుంట పరిధిలో పశువు మృతి చెందిన ఘటనపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, మృతికి గల కారణాలను నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ ప్రమాదం కారణమని తేలితే బాధిత రైతుకు న్యాయం చేయడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తెలంగాణ అడబిడ్డల అత్మీయబంధం పండుగ బతుకమ్మ

- విద్యుత్ శాఖ ఎస్ఈ. శ్రీనివాసచారి
- విద్యుత్ శాఖ కార్యాలయంలో ఘనంగా వేపకాయల బతుకమ్మ వేడుకలు

ఖమ్మం, అక్టోబర్ 16(ప్రజా కలం న్యూస్)

తెలంగాణ ఆడబిడ్డల జీవనంతో ముడిపడిన ఆత్మీయ బంధం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి అన్నారు.శుక్రవారం సాయంత్రం ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ వేడుకలను మహిళా అధికారులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎస్ఈ శ్రీనివాసచారి దంపతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళా అధికారులు, ఉద్యోగులు రంగురంగుల వివిధ రకాల పుష్పాలతో బతుకమ్మలను అందంగా పేర్చి, గౌరమ్మకు పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కొబ్బరికాయ, ప్రసాదాలు సమర్పించి, గౌరమ్మ ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.అనంతరం సంప్రదాయబద్ధంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి మహిళా ఉద్యోగులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆటపాటలతో సందడి చేశారు. పూల సోయగాలు, బతుకమ్మ పాటలు, మహిళల కోలాటాలతో విద్యుత్ శాఖ కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న బతుకమ్మ సంప్రదాయాలను పరిరక్షిస్తూ, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.విద్యుత్ శాఖలోని వివిధ స్థాయిల మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజించి, ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు.

4వ బెటాలియన్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

హనుమకొండ అక్టోబర్ 16 ప్రజా కలం ప్రతినిధి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు 4వ బెటాలియన్ లో అత్యంత వైభవంగా జరిగాయి.బెటాలియన్ లో విధులు నిర్వహిస్తున్న మినిస్టియల్ మహిళా సిబ్బంది,అధికారులు అందరూ కలిసికట్టుగా ఈ సంబరాలలో పాల్గొన్నారు.మహిళా సిబ్బంది రంగురంగుల తీరొక్క పూలతో బతుకమ్మలను ఎంతో అందంగా పేర్చారు.అనంతరం సాంప్రదాయ దుస్తులల్లో బతుకమ్మలతో సాంప్రదాయ బతుకమ్మ పాటలకు లయబద్ధంగా నృత్యాలు చేశారు. మహిళల చప్పట్లు,ఆటపాటలతో బెటాలియన్ ప్రాంగణమంతా కోలాహలంగా మారింది.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా బెటాలియన్ కమాండెంట్ శ్రీ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.మహిళా సిబ్బందికి ఇలాంటి పండుగలు మానసిక ఉల్లాసాన్ని,ఐక్యతను ఇస్తాయని ఆయన



కొనియాడారు.మన సంస్కృతిని కాపాడుకుంటూ, పండుగలను ఇంత ఉత్సాహంగా జరుపుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ వంశీ మోహన్ రెడ్డి,అసిస్టెంట్ కమాండెంట్ రాజు,ఆర్ఐలు రాజ్ కుమార్, రాంప్రసాద్,యూనిట్ మెడికల్ ఆఫీసర్ అరుణ్,ఎఒ వసీం ఫర్హానా ఇతర సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

బెల్లంపల్లి మండలం లో కల్వరి మినిస్ట్రీస్
50 రోజుల ఉపవాస ముగింపు సభ

పేద ప్రజల కోసం ఆసుపత్రి, పాఠశాల ఏర్పాటు చేస్తాం: కల్వరి మినిస్ట్రీస్ పాస్టర్ ప్రవీణ్ కుమార్



బెల్లంపల్లి, అక్టోబర్ 16, (ప్రజాకలం) ప్రతినిధి.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం లోని కల్వరి మినిస్ట్రీస్ చర్చ్ ఫౌండర్ పాస్టర్,ప్రవీణ్ సిస్టర్,షారోని ఆధ్వర్యంలో 50 రోజుల ఉపవాస దీక్ష ముగింపు సభ గురువారం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, మాజీ జెడ్పిటిసి కార్యూరిరామచందర్,టీపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి,మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్,మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య,ప్రజా ప్రతినిధులు, భారీ సంఖ్యలో వివిధ రాష్ట్రాల నుండే కాకుండా వివిధ దేశాలనుండి, క్రైస్తవులు ఈ సభకు తరలివచ్చారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోనీ జిల్లా పోలీస్ అధికారులు ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా పాస్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల ప్రజల కోసం 50 రోజుల ఉపవాస దీక్షలు చేయడం జరుగుతుందనీ, బెల్లంపల్లి తో పాటు ప్రపంచ దేశాల ప్రజలందరు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో,అష్ట ఐశ్వర్యాలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థన చేసామన్నారు.బెల్లంపల్లిలో పేద ప్రజలకోసం ఉచిత హాస్పిటల్,పేద విద్యార్థుల కోసం ఉచిత పాఠశాల ఏర్పాటు చేయాలనేదే మాకల అని పేదప్రజలకు నిత్య అన్నదానం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.ముఖ్య అతిథులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ దంపతులు పేదప్రజలకు సేవ చేయాలనే మంచి ఉద్దేశానికి పార్టీలకు అతీతంగా సహాయ సహకారాలు అందిస్తామని,బెల్లంపల్లి లాంటి మారుమూల ప్రాంతాన్ని ప్రపంచ దేశాల కు పరిచయం చేసిన పాస్టర్ ప్రవీణ్ సిస్టర్ షారోనికి కృతజ్ఞతలు తెలిపారు.

సద్దుల బతుకమ్మకి ఏర్పాట్లు పూర్తి..

వెల్గటూర్, అక్టోబర్ 16, ప్రజాకలం, ప్రతినిధివెల్గటూర్ మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో బతుకమ్మ నిమజ్జనానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను సర్పంచ్ భూపెల్లి రాజయ్య, ఉపసర్పంచ్ యాగండ్ల గంగయ్య, పంచాయతీ కార్యదర్శి కుమార్ స్వామి, కారోబార్ నరేష్, పంచాయతీ పాలక వర్గం సభ్యులు గ్రామపంచాయతీ సిబ్బంది శుక్రవారం పూర్తి చేశారు. ఆదివారం మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేసే స్తంభంపల్లి పెద్ద చెరువు వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.



రహదారి పై గల ముళ్ళ చెట్లను తొలిగించి, రహదారి ని శుభ్రం చేశారు. నిమజ్జన సమయంలో బతుకమ్మలతో తరలి వచ్చే మహిళలకోసం బతుకమ్మ ఘాట్ వద్ద గల కాలి స్థలాన్ని శుభ్రం చేయించారు. గ్రామంలో వీధి దీపాలను ఏర్పాటు చేసి, డ్రైనేజీలలో గల పూడికను తొలగించి వేశారు.

జర్నలిస్టులపై దాడి అమానుషం

- బాధ్యులపై చర్యలకు టీయూడబ్ల్యూజే-ఐజేయూ డిమాండ్

పెద్దపల్లి,అక్టోబర్ 16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) వార్తా కథనాలు రాశారన్న కక్షతో జర్నలిస్టులు సంపత్,ఎడిటర్ పొత్తూరి శేఖర్లపై పోలీసులు దాడి చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని,దీనిపై తక్షణమే నిష్పాక్షిక, స్వతంత్ర విచారణ జరిపించాలని పెద్దపల్లి టీయూడబ్ల్యూజే – ఐజేయూ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మల్లావర్జుల వంశీవిద్యానంద్,ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్,పెద్దపల్లి పట్టణ,మండల అధ్యక్ష,కార్యదర్శులు వీరమల్ల విద్యాసాగర్ రావు,ఆకుల రమేష్ సంయుక్తంగా స్పందించారు.వార్తలు రాసినందుకు పాత్రికేయులపై దౌర్జన్యానికి పాల్పడిన గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్తో పాటు సంబంధిత సిబ్బందిని వెంటనే సర్వీసు నుంచి సస్పెండ్ చేయాలని వారు కోరారు.వారిపై చట్టపరమైన క్రిమినల్ కేసులతో పాటు శాఖాపరమైన విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.దాడికి సంబంధించిన కీలక ఆధారాలైన పోలీస్స్టేషన్ సీసీటీవీ ఫుటేజీ, అరెస్టు రికార్డులు,బాధితుల వైద్య నివేదికలను ఎటువంటి తారుమారు జరగకుండా అధికారులు భద్రపరచాలని నేతలు కోరారు.దాడికి గురైన జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించడంతో పాటు,వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందించి ఆ ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు,ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.



ఘనంగా దసరా నవరాత్రి వేడుకలు

- ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేత హుస్సాముద్దీన్, బిజెపి నాయకుడు యశ్వంత్

హైదరాబాద్ (అంబర్పేట): అక్టోబర్ 16 (ప్రజాకలం న్యూస్) ఆజాద్ నగర్, ప్రేమ్ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల సందర్భంగా కాలనీలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొహమ్మద్ హుస్సాముద్దీన్, అలాగే బిజెపి నాయకులు యశ్వంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాలనీ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా ఇరు పార్టీల నాయకులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, పాషా భాయ్ లింగరావు రత్నంకర్ వెంకటేష్ గుప్త నర్సింగ్ గుప్తా పోలీస్ శ్రీనివాస్ శ్రీకాంత్ మనోజ్ యాదవ్ శివ యాదవ్ వినోద్ యాదవ్ నితిన్ యాదవ్ రఘు చారి రాకేష్ మల్లేష్ ఉపేందర్ నవీన్ తిరుపతి గుప్తాస్థానిక కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు.



పట్టభద్రులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

- తల్లాడ తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి సూచన



తల్లాడ అక్టోబర్ 16 ప్రజా కలం న్యూస్ పట్టబద్రులందరూ తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తల్లాడ తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా డిగ్రీ పట్టా పొందిన ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా ఉన్న ఓటర్లులందరూ ఓటు హక్కు చేసుకోవాలని వెల్లడించారు.

కూసుమంచి సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఎండీ

- అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు ఆదేశాలు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి(ఐపఎస్)



పాలేరు అక్టోబర్ 16(ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండల కేంద్రంలోని శుక్రవారం 132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ఇనుగుర్తి శ్రీనివాసాచారి, రాంబాబు, డీఈ సీహెచ్ నాగేశ్వరరావు, ఏడీఈ వెంకట్, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్ఐ నాగరాజుకు ఘన సన్మానం

టీడబ్ల్యూఎంఎఫ్ జిల్లా ఇన్‌చార్జి గుండా ఉపేందర్ రెడ్డి



పాలేరు అక్టోబర్ 16(ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండల కేంద్రంలోని శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎస్సై నాగరాజును టీడబ్ల్యూఎంఎఫ్ జిల్లా ఇన్‌చార్జి గుండా ఉపేందర్ రెడ్డి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్లకు పైగా శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా సేవలందించారని కొనియాడారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌కు శుభాకాంక్షలు తెలిపి, మండలంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటూ శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, మంద చంద్రశేఖర్ గౌడ్, సీనియర్ పాత్రికేయులు సవాల్వాడి వేణు, ఫోటోగ్రాఫర్ శ్రీను, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి ఎస్ఐగా సతీష్ బాధ్యతల స్వీకరణ



పాలేరు అక్టోబర్ 16(ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండల కేంద్రంలోని శుక్రవారం పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా సతీష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన నాగరాజు బదిలీపై కల్లూరుకు వెళ్లడంతో ఆయన స్థానంలో సతీష్ నియమితులై బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ సతీష్ కూసుమంచి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించనున్నారు. ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువయ్యేలా కృషి చేయడంతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణ, నేరాల నివారణ, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు.అలాగే, మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు. నూతన ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై సతీష్ ని,పలువురు ప్రజాప్రతినిధులు కలిసి అభినందనలు తెలియజేశారు.

చినుకు పడితే చాలు.. జిల్లా కేంద్రం జలమయం!

మున్సిపల్ అధికారులారా.. ఇదేం దుస్థితి?

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 16 (ప్రజా కలం):జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రహదారులు శుక్రవారం కురిసిన వర్షానికి చెరువులను తలపించాయి. రాజీవ్ మార్గ్ నుంచి పాత బస్టాండ్‌కు వెళ్లే రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డ్రైనేజీలను సకాలంలో శుభ్రం చేయకపోవడం వల్లే వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతోందని పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే రహదారులు జలమయంగా మారుతుండటంతో మున్సిపల్ అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన రహదారులపైనే వర్షపు నీరు నిలిచిపోతుంటే అధికారులు పట్టించుకోవడం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు నిలిచిన కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీలను సక్రమంగా శుభ్రం చేయడంతో పాటు, వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



అమెరికాలో వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో

భద్రాచలం వాసికి కాంస్య పతకం

74 ఏళ్ల వయసులోనూ అద్భుత ప్రతిభ..

బైపాస్ సర్జరీని అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో సత్తా



ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, అక్టోబర్ 16

వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏ వయసులోనైనా అసాధారణ విజయాలు సాధించవచ్చని తెలంగాణ రాష్ట్రానికి చెందిన 74 ఏళ్ల సీనియర్ క్రీడాకారుడు డి.వి. శంకర్ రావు నిరూపించారు. గుండెకు బైపాస్ సర్జరీ జరిగినప్పటికీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా, తన సంకల్పబలంతో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. అమెరికాలో నిర్వహించిన ప్రతిష్టాత్మక వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు అమెరికాలో నిర్వహించిన ప్రపంచ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో శంకర్ రావు పాల్గొని ఈ ఘనత సాధించారు. 74 ఏళ్ల వయసులోనూ శారీరక సవాళ్లను అధిగమిస్తూ ఆయన సాధించిన ఈ విజయం పట్ల భద్రాచలం ప్రాంతంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

కోచ్ మార్గదర్శకత్వంలో కఠిన శిక్షణ

భద్రాచలంలోని ప్రముఖ సిటీ స్టైల్ జిమ్‌లో కోచ్ జి.వి. రామిరెడ్డి పర్యవేక్షణలో శంకర్ రావు ఈ పోటీలకు సిద్ధమయ్యారు. కఠినమైన శిక్షణతో పాటు కోచ్ అందించిన మార్గదర్శకత్వం, శంకర్ రావు చూపిన పట్టుదల, అంకితభావం ఈ విజయానికి దోహదపడ్డాయి. వయసుతో సంబంధం లేకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన చేస్తే విజయాలు సాధించవచ్చని ఆయన తన ప్రదర్శనతో చాటిచెప్పారు.

శంకర్ రావు, కోచ్ రామిరెడ్డికి అభినందనలు

అంతర్జాతీయ వేదికపై కాంస్య పతకం సాధించిన డి.వి. శంకర్ రావుతో పాటు ఆయనకు శిక్షణ అందించిన కోచ్ జి.వి. రామిరెడ్డిని పలువురు రాజకీయ నాయకులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు అభినందించారు. రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ జనరల్ సెక్రటరీ జోసెఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. మల్లేష్, భద్రాద్రి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, పాకాల దుర్గా ప్రసాద్‌తో పాటు గ్రీన్ భద్రాద్రి, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భద్రాచలం ప్రాంతవాసులు శంకర్ రావు విజయాన్ని ప్రశంసించారు. ఈ విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని, పట్టుదలతో సాధన చేస్తే వయసు అడ్డంకి కాదని శంకర్ రావు నిరూపించారని పలువురు పేర్కొన్నారు.

తల్లాడ మండల అధికారులకు

వాలీబాల్ క్రీడాకారులు వినతి



తల్లాడ అక్టోబర్ 16 ప్రజా కలం న్యూస్

తల్లాడ తహసీల్దార్ కార్యాలయం ప్రక్కన ఉన్న స్థలంలో గత 40 సంవత్సరాలుగా మేము క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసుకుని వాలీబాల్ ఆడుతున్నాము. ఈ మైదానం ద్వారా ఎంతో మంది క్రీడాకారులు నైపుణ్యం సంపాదించి ఉద్యోగాలు సాధించారు. ఈరోజుకీ ఎంతో మంది యువత శారీరక దృఢత్వం, ఆరోగ్యం, ఆనందం కోసం ఈ మైదానాన్ని నమ్ముకుని ఉన్నారు. భవిష్యత్తులో కూడా చాలామంది ఉద్యోగాలు సాధించేందుకు ఇక్కడ సాధన చేస్తున్నారు. 2011 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో, ఈ మైదానంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌కు జిల్లా కలెక్టర్, కమిషనర్ ప్రారంభించడం జరిగింది. అంతేకాకుండా అప్పటి సీఐ, ఎస్సై కూడా ఈ టోర్నమెంట్‌లో పాల్గొని క్రీడాకారులను అభినందించారు. అప్పట్లో గ్రామ పంచాయతీ, అధికారుల ప్రోత్సాహంతో ఈ ఆట స్థలం ప్రసిద్ధి చెందింది. ఇటీవల ఈ క్రీడా స్థలం ప్రక్కన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు జరుగుతున్నాయి. ఆట నియమాల ప్రకారం వాలీబాల్ క్రీడా ప్రాంగణానికి చుట్టూ సర్వీస్ జోన్ కనీసం 20 అడుగులు ఉండాలి. కానీ ప్రస్తుతం ఇక్కడ కేవలం 13 అడుగులు మాత్రమే ఉంది. ఇటువంటి పరిస్థితిలో మరింత స్థలాన్ని ఆక్రమించడం లేదా నిర్మాణాల వల్ల సర్వీస్ జోన్ తగ్గినట్లయితే, క్రీడాకారులు ఆడేందుకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. ఈ క్రీడా ప్రాంగణంలో ఉన్న సర్వీస్ జోన్ నుండి ఎలాంటి నూతన నిర్మాణాలు, రహదారులు నిర్మించకుండా ఆటంకాన్ని నివారించాలి. గత 40 ఏళ్లుగా అధికారుల అభినందనలు పొందుతూ వస్తున్న ఈ స్థలాన్ని గ్రామ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, తల్లాడ వాలీబాల్ క్రీడా ప్రాంగణం గా గుర్తిస్తూ గ్రామ పంచాయతీలో అధికారిక తీర్మానం ఆమోదించి, స్థలాన్ని పూర్తిగా క్రీడలకే కేటాయించాలి. క్రీడాకారుల భవిష్యత్తును కాపాడేలా సానుకూల నిర్ణయం తీసుకుని, తగిన తీర్మాన ప్రతిని అందించగలరని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో చల్లా వెంకట్, ధరావత్ కృష్ణ, మొక్క సైదులు, షేక్ మెహరాజ్, నాయకులు షేక్ యూసుఫ్, జూకూరి శ్రీను, నాగేశ్వరరావు, సంపత్, పెరిక శ్రీను, గుంటుపల్లి రవి, కృష్ణ,మనోజ్, పుల్లారావు, అజయ్ చక్రవర్తి,శివ, మదార,పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు



నాగర్‌కర్నూల్ అక్టోబర్ 16(ప్రజా కలం): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించి పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్‌ఎం వైద్య సిబ్బంది చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బిజ్జా శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వైద్య సేవలు అందించిన ఉద్యోగులకు నేటికీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలోనే కొనసాగడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు పలుమార్లు ఎన్నికైతే పింఛన్లు పొందుతున్నారని, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న వైద్య సిబ్బందికి మాత్రం ఉద్యోగ భద్రత కల్పించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నో సంవత్సరాలుగా వైద్య రంగంలో సేవలందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించి, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు న్యాయంగా దక్కాల్సిన వేతనాలు, ఇంక్రిమెంట్లు, బోనస్‌లు, ప్రసూతి సెలవులు, ఇతర సర్వీసు ప్రయోజనాలను వెంటనే కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించి పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి కేడర్ ఉద్యోగికి 100 శాతం గ్రాస్ జీతం చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. మూడేళ్లకోసారి బదిలీ చేసే విధానాన్ని రద్దు చేసి, బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి పాత స్థానాల్లో నియమించాలని, జీఓ 1195ను పునఃపరిశీలించాలని కోరుతున్నారు. అలాగే బదిలీ అయిన ఉద్యోగుల సర్వీసు వివరాలను స్టేట్ హెల్త్ సొసైటీ నుంచి సేకరించి, వారికి రావాల్సిన ప్రయోజనాలు కల్పించాలని, ప్రతి నెలా ఐదో తేదీలోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ఐదు శాతం ఇంక్రిమెంట్‌తో పాటు ఎనిమిది శాతం లాయల్టీ బోనస్ ఇవ్వాలని, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు కేడర్‌తో సంబంధం లేకుండా 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఉద్యోగులను తొలగించే పరిస్థితుల్లో వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా పరిహారం లేదా ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించే వరకు వారి పోరాటానికి ఏఐటీయూసీ అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ, కార్యదర్శి డాక్టర్ డి. కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ జగన్, ఉపాధ్యక్షులు డాక్టర్ మహతి, డాక్టర్ సంధ్యారాణి, హైమావతి తదితర ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో ముగ్గురికి చోటు.. మల్లార్‌లో హర్షం!

పీఆర్‌టీయూ టీఎస్ నూతన కమిటీలో మండల నేతలు

నూతన బాధ్యులకు శుభాకాంక్షలు తెలిపిన మండల శాఖ



మల్హర్, అక్టోబరు 16 ప్రజాకలం ప్రతినిధి... పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గంలో మల్హర్‌రావు మండలానికి చెందిన ముగ్గురు నాయకులకు చోటు లభించడంతో మండల శాఖ హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా చి. సుధాకర్, జి. తిరుపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా సిహెచ్. పూర్ణచందర్ ఎన్నిక కావడంపై మండల పీఆర్‌టీయూ ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నూతన బాధ్యులకు మండల శాఖ తరఫున శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన నాయకులు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, వారి హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని ఆకాంక్షించారు.విద్యారంగ అభివృద్ధికి తోడ్పడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. మల్హర్‌రావు మండలం నుంచి ముగ్గురు నాయకులకు రాష్ట్ర కార్యవర్గంలో ప్రాతినిధ్యం లభించడం స్థానిక ఉపాధ్యాయులకు గర్వకారణమని మండల పీఆర్‌టీయూ ప్రతినిధులు పేర్కొన్నారు. నూతన నాయకుల ఆధ్వర్యంలో సంఘం మరింత బలోపేతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖమ్మంలోనే తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



ఖమ్మం అక్టోబర్ 16(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం జడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ పిడమర్తి రవి అన్న పిలుపుమేరకు తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి, చిత్రపటానికి పాలాభిషేకం చేశారు . ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారును గుర్తించడానికి మరియు వాళ్ల పేర్లు నమోదు చేసుకోవడానికి వెబ్సైట్ ప్రక్రియను ప్రారంభించినందుకు ఉద్యమకారుల అందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . వెబ్సైట్ ప్రక్రియను వేగవంతం చేసి తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డు , ఇంటి నిర్మాణం కోసం 10 లక్షల రూపాయలు , నేలకు 30 వేలు వేతనం ఇచ్చేలా చూడాలని కోరారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు జిల్లా విజయ్ కుమార్ , తెలంగాణ ఉద్యమ జేఏసీ రాష్ట్ర నాయకులు మట్టి గురుమూర్తి , డాక్టర్ కె.వి కృష్ణారావు , కొరకప్ప రామారావు , మహేష్ , అరుణ , సరిత , సవిత , సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు .

పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో

ఘనంగా బతుకమ్మ సంబరాలు



నాగర్‌కర్నూల్ అక్టోబర్ 16 (ప్రజా కలం): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను నాగర్‌కర్నూల్ జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు తీరొక్క రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళా ఉద్యోగులు బతుకమ్మల చుట్టూ చేరి ఉత్సాహంగా ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలతో జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ కార్యాలయ ప్రాంగణం మార్మోగిందన్నారు.పూల పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటూ మహిళా ఉద్యోగులు తమ సంప్రదాయాలను చాటిచెప్పారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూబతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి పండుగలు ఉద్యోగుల్లో ఐక్యత, సోదరభావం, పరస్పర సాన్నిహిత్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ వేడుకల్లో జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి (డీవీఏహెచ్ఓ) డాక్టర్ బి. జ్ఞాన శేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఏ.ఎల్. నరసింహ, పశువైద్యులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా డి. వెంకట మాధవ రావు బాధ్యతల స్వీకరణ



నిర్మల్ అక్టోబర్ 16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లా నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా డి. వెంకట మాధవ రావు శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు.

అంతకుముంది కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాకు పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని చెప్పారు. అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించినందున పలువురు కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మాలల హక్కుల సాధనకై పోరాడుదాం

తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ కో-కన్వీనర్ చింతపల్లి శివశంకర్



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 16 (ప్రజా కలం): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మాల సామాజిక వర్గానికి ఎక్కడ అన్యాయం జరిగినా, వారి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తానని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ చింతపల్లి శివశంకర్ తెలిపారు. రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ల అమలు సహా మాలల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీన హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో రాష్ట్ర కో-కన్వీనర్‌గా చింతపల్లి శివశంకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ఆయనకు నియామకానికి సంబంధించిన అధికారిక ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దెల చంటి, సోషల్ మీడియా పార్లమెంట్ ఇన్‌చార్జి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, దళితరత్న అవార్డు గ్రహీత జెట్టి చంద్రయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గాజుల భాస్కర్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సామ కుర్మయ్య, చింతపల్లి కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రంలో చింతపల్లి శివశంకర్‌ను పలువురు నాయకులు, సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర కో-కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన జేఏసీ చైర్మన్ చెరుకు రామచంద్రన్నకు, మంత్రి నరసింహ అన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా మాల సామాజిక వర్గ ప్రజల హక్కుల సాధనకై కృషి చేస్తానని తెలిపారు.

సర్పంచ్ లు ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలి

బైంసాలో అవగాహన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే
తానూర్, మండలాల వారికి 134 కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు అందజేత
ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ముధోల్ లో 35 మందికి కుట్టు మిషన్ల పంపిణీ
ముధోల్ లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంబించిన ఎమ్మెల్యే
వానలుపాడ్ గ్రామంలో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నిర్మల్ అక్టోబర్ 16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

సర్పంచ్ లు ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మరింత అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ సూచించారు. బైంసా లోని సురులోక్ గార్డెన్స్ లో నియోజకవర్గంలోని సర్పంచ్ లు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్ ని నో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తున నేపథ్యంలో భూగర్భ జలాలు పెరిగేలా కృషి చేయాలఅన్నారు.


134 మందికి కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులఅందజేత... నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తానూర్, ముధోల్ కు చెందిన 134 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అందజేశారు. దసరా పండుగ నేపథ్యంలో అన్ని మండలాల్లో చెక్కులను అందించడం జరుగుతుందన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

35 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ..ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ముధోల్ మండల కేంద్రంలో 35 మంది మహిళలకు కుట్టుమిషన్లను ఎమ్మెల్యే పటేల్ అందజేశారు. శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందాలని సూచించారు.

ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం.... ముధోల్ మండల కేంద్రానికి చెందిన గాయక్ వాడ్ జల్బ ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. అర్హులందరికీ దసలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానన్నారు.వానల్ పాడ్ గ్రామంలో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే... బైంసా మండలంలోని వానల్ పాడ్ గ్రామంలో ఆనందరావు పటేల్ కు చెందిన నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పటేల్ పాల్గొన్నారు... అన్ని కార్యక్రమాల్లో సర్పంచ్ లు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీ తిమ్మప్ప స్వామిని దర్శించుకున్న జిల్లా న్యాయమూర్తి

గద్వాల ప్రతినిధి అక్టోబర్ 16(ప్రజా కలం) జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని ప్రసిద్ధ శిలా క్షేత్రం శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శుక్రవారం గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శ్రీమతి జి. నిష్మా పాత్రుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు, అర్చకులు న్యాయమూర్తికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు స్వామివారి శేషవస్త్రం, చిత్రపటాన్ని న్యాయమూర్తికి బహూకరించారు. తొలిసారిగా ఆలయాన్ని సందర్శించిన న్యాయమూర్తికి ఆలయ చరిత్ర, విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను చైర్మన్ వివరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తల్లాడ వాలీబాల్ కోర్టుకు 40 సంవత్సరాల చరిత్ర

- ఉమ్మడి జిల్లా ఎస్పీ క్రాంతి రానా తాతా చేతులమీదుగా ప్రారంభం
- ఎంతోమంది యువకులకు ఉద్యోగాలు కల్పించిన కోర్టు



తల్లాడ అక్టోబర్16 ప్రజా కలం న్యూస్

తల్లాడ వాలిబాల్ కోర్టుకు 40 సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ కోర్టు ద్వారా వాలీబాల్ ఆడిన అనేకమంది క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇన్నాళ్ల నుండి తల్లాడ పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల యువకులు ఇక్కడకు వచ్చి క్రీడలు ఆడుతూ స్పోర్ట్స్ కోటా కింద పోలీస్ ఉద్యోగాలు సాధించిన ఘటనలు అనేక ఉన్నాయి. 2011 సంవత్సరంలో ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్న సమయంలో జిల్లా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ఈ కోర్టు ప్రారంభించారు. ప్రారంభించిన 15 ఏళ్ల నుండి ప్రతిరోజు యువకులు వాలీబాల్ సాధన చేస్తూ మంచి క్రీడాకారులుగా ఎదుగుతున్నాడు. ఇక్కడ క్రీడల ద్వారా శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన సంఘటనలు అనేకం ఉన్నాయి. యువకులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఈ కోర్టు ఉండటంవల్ల ప్రతిరోజు ఇ క్కడకు వచ్చి వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తూ పోలీస్ ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఈ వాలీబాల్ కోర్టు ద్వారానే తల్లాడకు దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఇటువంటి క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం స్థానిక ప్రజాప్రతినిధులకు, నాయకులకు ఎంతైనా ఉంది. అప్పటి సీఐ వెంకటేష్, ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో ఈ వారీబాలు కోర్టుకు శ్రీకారం జరిగింది. అదేవిధంగా వాలీబాల్ యూత్ కమిటీ అధ్యక్షుడుగా చల్లా వెంకటయ్య, ట్రెజరర్ గా మొక్క రాంబాబు, సెక్రటరీగా నీలం కిరణ్, జాయింట్ సెక్రెటరీగా మొక్క సైదులు, గుజ్జు వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులుగా గోపాల్ రెడ్డి పనిచేశారు. అదేవిధంగా ప్రస్తుతం వాలీబాల్ కోర్ట్ అధ్యక్షులుగా ధరావత్ కృష్ణ, ఉపేందర్, గ్రౌండ్ ఇన్చార్జిగా షేక్ మేహారాజ్ వ్యవహరిస్తున్నారు. అనేకమందికి అవకాశాలు కల్పించిన ఈ కోర్టును ఇక్కడే ఉంచాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఇందిరమ్మ మహిళా డెయిరీ లబ్ధిదారులకు పశువుల

షెడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

250 మంది లబ్ధిదారులకు పాడి పశువుల కొనుగోలుకు ఏర్పాట్లు
ప్రతి 1,000 పశువులకు 3 మహిళా స్వయం సహాయక సంఘాలతో ఒక క్లస్టర్ ఏర్పాటు చేయాలి
10 వేల మంది మహిళలకు నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
ఇందిరా మహిళా డెయిరీపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, అక్టోబర్ 16(ప్రజా కలం న్యూస్)

ఇందిరమ్మ మహిళా డెయిరీ పథకం క్రింద పాడి పశువుల పెంపకాన్ని ప్రోత్సహించడంతో పాటు, పశువుల షెడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ మహిళా డెయిరీ పథకానికి సంబంధించి పశువుల షెడ్ల నిర్మాణం, పాడి పశువుల కొనుగోలు, పశుగ్రాసం సాగు, మహిళలకు నైపుణ్య శిక్షణ తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలో పాడి పశువుల కొనుగోలుకు ప్రస్తుత విడతలో మరో 250 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు తెలిపారు. వీరికి సంబంధించి ప్రత్యేక నాన్ ఆపరేటివ్ బ్యాంకు ఖాతాలను తెరవాలని అధికారులకు సూచించారు. 250 మంది లబ్ధిదారులకు వివి-జి రామ్ జి పథకం క్రింద పశువుల షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.

పశువుల షెడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి:

మధిర నియోజకవర్గంలో మొత్తం 3,106 పశువుల షెడ్లు మంజూరు కాగా, 354 షెడ్ల నిర్మాణ మంజూరు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం వీబీ రామ్ జీ పథకం క్రింద 171 పశువుల షెడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటికే 147 షెడ్ల నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న షెడ్ల నిర్మాణ పనులను సమీక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.85 వేల సబ్సిడీతో పాటు, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు అదనంగా రూ.70 వేల సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశా లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు.


పశుగ్రాసం సాగుకు అవసరమైన భూములను గుర్తించాలి:

పాడి పశువులకు ఏడాది పొడవునా అవసరమైన పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచేందుకు ప్రతి క్లస్టర్ పరిధిలో పశుగ్రాసం అవసరాలను ముందుగానే అంచనా వేయాలని కలెక్టర్ సూచించారు. పశుగ్రాసం సాగుకు అనువైన భూములను గుర్తించి, అవసరమైన సాగు ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. గరిష్ఠంగా 200 ఎకరాల వరకు పశుగ్రాసం సాగు చేయగల మహిళా స్వయం సహాయక సంఘాలను ఎంపిక చేయాలని తెలిపారు. ప్రతి 1,000 పశువులకు మూడు మహిళా స్వయం సహాయక సంఘాలను అనుసంధానించి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. పశువులకు అవసరమైన మేత నిరంతరంగా అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అన్నారు.

మధిర నియోజకవర్గంలో 10 వేల మంది మహిళలకు నైపుణ్య శిక్షణ: ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మధిర నియోజకవర్గంలో 10 వేల మంది మహిళలకు నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నైపుణ్య శిక్షణకు పూర్తి వ్యయ అంచనాతో పాటు, శిక్షణ కేంద్రాల షెడ్ల నిర్మాణానికి వ్యయ అంచనాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. శిక్షణ కోసం అవసరమైన మౌళిక సదుపాయాలు, యంత్రాలు, నిధుల అంచనాలను సమగ్రంగా సిద్ధం చేయాలని సూచించారు. మహిళలకు ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు, పాడి పశువుల పెంపకం ద్వారా ఆదాయం పొందేలా ఇందిరమ్మ మహిళా డెయిరీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డీవో శ్రీరామ్, జిల్లా పశు సంవర్ధక అధికారి పురందర్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఫిరంగి, సంక్షేమ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును విమర్శిస్తే ఖబర్దార్!

ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్, తాడిచర్ల పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య
మండల అధ్యక్షులు జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్.
శాత్రాజ్‌పల్లి ఇళ్ల కూల్చివేతను మంత్రికి ఆపాదించడం పుట్ట మధు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం



మల్హర్, అక్టోబరు 16 ప్రజాకలం ప్రతినిధి... శాత్రాజ్‌పల్లిలో ఇళ్ల కూల్చివేత ఘటనను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆపాదిస్తూ పుట్ట మధు విమర్శలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్, తాడిచర్ల పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబుపై విమర్శలు చేయడం మానుకోవాలని, బాధితుల సమస్యను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని హితవు పలికారు. శుక్రవారం తాడిచర్లలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.శాత్రాజ్‌పల్లి బాధితులకు నిజంగా న్యాయం చేయాలనే చిత్తశుద్ధి పుట్ట మధుకు ఉంటే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టాలని సవాల్ విసిరారు. గతంలో డేంజర్ జోన్ బాధితులకు ఇచ్చిన హామీల అమలుపై ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

బాధితుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు కృషి చేయాలి తప్ప, రాజకీయ విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించకూడదన్నారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో తాడిచర్ల డేంజర్ జోన్ బాధితులకు పరిహారం అందించేందుకు రూ.261 కోట్లను జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేయించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బాధితుల వివరాల సేకరణ, నర్వే ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో డ్రాఫ్ట్ డిక్లరేషన్ ప్రక్రియ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గుర్తించాలని కోరారు.ఈ సమావేశంలో మల్హర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇందారపు చంద్రయ్య, సర్పంచ్ బండి స్వామి, చిన్నతూండ్ల సర్పంచ్ గడ్డం క్రాంతి, ఉపసర్పంచ్ బొబ్బిలి రాజు, గ్రామశాఖ అధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు బొమ్మ రమేష్‌రెడ్డి, వొన్న తిరుపతిరావు, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు బాసు హనుమంతు నాయుడు ఆర్థిక సాయం

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 16 (ప్రజా కలం):

కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి రాయచూరు జిల్లా కేంద్రంలోని నుర్షిత, ఓపిక్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు తన్నీరు హరీశ్ రావు సూచన మేరకు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లిన ఆయన.. ప్రమాదంలో గాయపడిన ఏసేపు భార్య రుత్తమ్మ, నాగన్న కుమారుడు సందీప్‌లను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.20,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. ప్రమాదంలో గాయపడిన బాధితులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి తమ ఇళ్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవడం మానవతా దృక్పథంతో తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూర్ పాషా, బాసు గోపాల్, రాజు నాయుడు, వెంకటరమణ, జమన్న, నాగరాజు, ఆంజనేయులు, సామెలు, ఇంజన్న, తిమ్మప్ప, రాముడు, నరసింహులు, గోవిందు, వీరేష్, భాస్కర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాల్లో బండ్ల జ్యోతి సందడి!

మెడికల్ కాలేజీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు..
లెక్చరర్లతో కలిసి ఆటపాటల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 16 (ప్రజా కలం):

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి, నరసింహులు యాదవ్ పుష్పగుచ్ఛాలు అందించి ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మెడికల్ కాలేజీ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. బండ్ల జ్యోతి కాలేజీ లెక్చరర్లతో కలిసి బతుకమ్మ పాటలకు నృత్యం చేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలు, కోలాటాలతో సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా బండ్ల జ్యోతి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఆడపడుచులకు ఎంతో ప్రత్యేకమైన ఈ పండుగ ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ మహిళల ఐకమత్యాన్ని చాటుతుందని పేర్కొన్నారు. బతుకమ్మ, దేవీ శరన్నవరాత్రులు, దసరా పండుగల సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.గౌరమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మహిళలంతా కలిసి సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, వైద్యులు, లెక్చరర్లు, సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా బస్సు కష్టాలు.. ఆటోలే దిక్కు!

బిజ్వారానికి పూర్తిస్థాయిలో బస్సు సౌకర్యం కల్పించాలి
రాత్రివేళ విద్యార్థులు, ప్రయాణికుల అవస్థలు..
ఆర్టీసీ అధికారులకు గ్రామస్తుల విజ్ఞప్తి



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 16 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం గ్రామ ప్రజలు గత ఐదేళ్లుగా సరైన బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గద్వాల జిల్లా కేంద్రం నుంచి బిజ్వారం గ్రామానికి ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల అవసరాల కోసం మాత్రమే ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.దీంతో సాధారణ ప్రయాణికులు, ఉద్యోగులు, ఇతర పనుల నిమిత్తం గద్వాలకు వెళ్లి తిరిగి వచ్చే ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం దసరా పండుగ సమయంలోనూ సరిపడా బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికుల కష్టాలు మరింత పెరిగాయి.ముఖ్యంగా రాత్రివేళల్లో గ్రామానికి చేరుకోవాలన్నా,ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోల్లో ప్రయాణించడం వల్ల అదనపు ఖర్చులతో పాటు రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు.బిజ్వారం గ్రామంతో పాటు ఊరు సంఘాల, మర్లపల్లి, జిల్లెడబండ, మేకల సోంపల్లి, దాసరిపల్లి, ఉలిగేపల్లి తదితర గ్రామాల ప్రజలకు కూడా మెరుగైన రవాణా సౌకర్యం అవసరమని గ్రామస్తులు కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్, ఆర్టీసీ అధికారులు స్పందించాలి... ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గద్వాల జిల్లా కేంద్రం నుంచి బిజ్వారం గ్రామం వరకు ఉదయం, సాయంత్రం వేళల్లోనే కాకుండా ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. ఐదేళ్లుగా కొనసాగుతున్న బస్సు సమస్యకు అధికారులు ఇప్పటికైనా పరిష్కారం చూపి, గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అక్రిడిటేషన్ కార్డుల జారీలో వివక్ష తగదు

సీఎం సొంత జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల కిరికిరి సిగ్గు చేటు - మహబూబ్ నగర్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం వెంటనే నిర్వహించాలి

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులు గండిటి నరసింహులు, జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్ డిమాండ్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 16:

మహబూబ్ నగర్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ 4వ సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని, దరఖాస్తు చేసుకున్న అందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయడంలో వివక్ష తగదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గండీటి నరసింహులు, జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్, కోశాధికారి ఏముల నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా సమావేశాలు నిర్వహించినా కొందరు సీనియర్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు కాలేదని తెలిపారు. సమాచార శాఖ అధికారి తాత్సారం, నిర్లక్ష్యం, మొండి వైఖరి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని ఘాటుగా విమర్శించారు. 'తా పట్టిన కుందేలుకు మూడే కాళ్లు' అన్న చందంగా వ్యవహరిస్తూ గౌరవ అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఈ సందర్భంగా వారు కోరారు. పెండింగ్ దరఖాస్తుదారులు అందరికీ ఒకే విడతలో ఇవ్వాలని కోరారు. చిన్న పెద్ద పత్రిక చిన్న పెద్ద చానల్ అంటూ వివక్ష సరికాదని అలాగే సమాచార అధికారి తమ పట్ల వివక్ష పాటిస్తున్నారని ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులు కొందరు తమ సంఘం దృష్టికి తెచ్చారని తెలిపారు. ఇలాంటి డిస్క్రిమినేషన్ సరికాదని అన్నారు. కనీసం దసరా పండుగ నాటికి దరఖాస్తు చేసుకున్న అందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసి వారిలో సంతోషం నింపాలని ఆకాంక్షించారు.

అక్రిడిటేషన్ కార్డులు ఇస్తేనే సరైన వివరణ అవుతుంది... తమ సంఘం తరఫున ఈనెల 7న ప్రజావాణి కార్యక్రమంలో అర్హులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కమిటీ చైర్మన్ గారికి వినతి పత్రం సమర్పించామని తెలిపారు. సదరు వినతికి వివరణ ఇవ్వడం మంచిదైనా అర్హులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇస్తేనే సరైన వివరణ అవుతుందని తెలిపారు.

సీఎం సొంత జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల కిరికిరి సిగ్గు చేటు..రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల పరిధిలో 99శాతం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేశారని, గౌరవ సీఎం రేవంత్ రెడ్డి గారి సొంత జిల్లా అయిన మహబూబ్ నగర్ జిల్లాలో నిజమైన జర్నలిస్టులకు నేటికీ అక్రిడిటేషన్ కార్డులు అందకపోవడం దురదృష్టకరమన్నారు. ఇంకా దాదాపు 200 మందికి కార్డులు మంజూరు చేయాల్సి ఉందని తెలిపారు.

గడువు ముగిసిన బస్సు పాసు...తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తీర్పు మేరకు పాత అక్రిడిటేషన్ పై జర్నలిస్టులకు జారీ చేసిన బస్సు పాసు గడువు ఈనెల 15వ తేదీతో ముగిసిందని తెలిపారు. కొత్త కార్డులు జారీ చేసి అందుబాటులోకి వచ్చేవరకు పాత అక్రిడిటేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టులకు బస్సు పాసు గడువు మరోసారి పొడిగింపు చేయాలని కోరారు.

ఫ్రీలాన్స్ కేటగిరీ కోటాను ఉమ్మడి జిల్లాలకు విస్తరించాలి

ఐ& పి ఆర్ అక్రిడిటేషన్ వెబ్ సైట్ విండోలో పొందుపరిచిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు కోటాను తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల కేంద్రాలకు విస్తరించాలని ఈ సందర్భంగా వారు సమాచార శాఖను డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నివాసం ఉంటూ జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న సూపర్ సీనియర్ జర్నలిస్టులకు (25 సంవత్సరాల పైబడి) ఫ్రీలాన్స్ కేటగిరీలో అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చే విధంగా జీవోను సవరణ చేయాలని కోరారు.

ఉద్యమ కాలం జర్నలిస్టులకు ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పించాలి

2001 నుండి 2014 వరకు తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిజంలో కొనసాగి తెలంగాణ స్వతంత్ర ఉద్యమం కోసం పని చేసిన జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు.

పెండింగ్ లో ఉన్న అక్రిడేషన్ కార్డులు

సత్వరమే మంజూరు చేయాలి

- టియుడబ్ల్యూజే (టిజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ

- జిల్లా కలెక్టర్‌కు టిజెఎఫ్ జర్నలిస్టుల బృందం వినతి



ఖమ్మం అక్టోబర్ 16(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు రెండవ విడుదల విడుదల కావలసిన అక్రిడేషన్ కార్డులను సత్వరమే మంజూరు చేయాలని టి యు డబ్ల్యు జే (టి జే ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు డిమాండ్ చేశారు. ఖమ్మం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ను టి జే ఎఫ్ జర్నలిస్టుల బృందం శుక్రవారం కలిసి అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు మాట్లాడుతూ... పెండింగ్ లో ఉన్న పెద్ద పత్రికలు, మీడియం, చిన్న పత్రికలు, అదేవిధంగా కేబుల్ చానల్స్, డెస్క్ జర్నలిస్టులకు మంజూరు కావాల్సిన అక్రిడేషన్ కార్డులను సకాలంలో ఇవ్వకుండా ఐ అండ్ పి ఆర్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, అక్రిడేషన్ కమిటీ సమావేశంలో తీర్మానం చేసిన కూడా ఇంతవరకు కార్డులు ఇవ్వకుండా జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దాదాపు జిల్లాలో 290 కి పైగా అక్రిడేషన్ కార్డులు ఇంకా మంజూరు కావాల్సి ఉందని, అనేక ఆటంకాలు సృష్టిస్తూ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని కలెక్టర్ కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ. పెండింగ్ లో ఉన్న అక్రిడేషన్ కార్డులను సత్వరమే మంజూరు చేయాలని అక్కడే ఉన్న డిపిఆర్ఓ గౌస్ పాషా ను ఆదేశించారు. కాలయాపన చేయకుండా సకాలంలో అక్రిడేషన్లు ఇవ్వాలని, కేబుల్, డెస్క్ జర్నలిస్టులకు, అదేవిధంగా బిగ్ పేపర్లకు, మీడియం, స్మాల్ పేపర్లలో ఇంకా పెండింగ్ లో ఉన్న వారందరికీ తక్షణమే అక్రిడేషన్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు, ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, మందుల ఉపేందర్, ప్రశాంత్ రెడ్డి, భాస్కర్, మందటి వెంకటరమణ, అక్రిడేషన్ కమిటీ సభ్యులు ఫోటోగ్రాఫర్ రాజు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి,ఉపాధ్యక్షులు ముత్యాల కోటేశ్వరరావు,పానకాలరావు,జీవన్ రెడ్డి, రేపాక యాదగిరి, నగర కమిటీ అధ్యక్షులు కార్యదర్శులు యలమందుల జగదీష్, కరీష అశోక్, జిల్లా నాయకులు మోహన్, కె.వి, సాయి, కళ్యాణ్, నాగరాజు, తిరుపతిరావు, ఉల్లోజు రమేష్, గౌరీ శంకర్ ,మహిళ ప్రతినిధులు రోజా, మాధవి, కిరణ్మయి, రవి, పెంటి వెంకటేశ్వర్లు, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి - పదేండ్ల సమస్యకు పరిష్కారం

310 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై చట్టబద్ధమైన హక్కులు

ఆదర్శనగర్ కాలనీ అభివృద్ధికి రూ.2 కోట్లు.. నగరంలో రూ.603 కోట్లతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ

- వచ్చే ఎన్నికల గురించి కాకుండా, వచ్చే తరాల భవిష్యత్తు కోసం పనిచేసే నాయకులే చరిత్రలో నిలిచిపోతారు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 16:

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్‌నగర్ పట్టణంలోని క్రిస్టియన్‌పల్లి, ఆదర్శనగర్ ప్రాంతాలకు చెందిన 310 మంది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు , అన్నపూర్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తాతో కలిసి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 523 సర్వే నంబర్ పరిధిలో అనేక చిక్కుముడులు ఉన్నప్పటికీ, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించి 310 కుటుంబాలకు ఇళ్లపై చట్టబద్ధమైన హక్కులు కల్పించడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందించినప్పటికీ, సరైన గుర్తింపు పత్రాలు, చట్టబద్ధమైన ధ్రువపత్రాలు లేకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. ఇళ్లను వారసులకు బదిలీ చేసే విషయంలోనూ సమస్యలు తలెత్తాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు చిక్కుముడులు రాకుండా అన్ని అంశాలను పరిశీలించి, చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసిన తర్వాతే పట్టాలు పంపిణీ చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ పట్టాలు కేవలం కాగితాలు కావని, కుటుంబాలకు భద్రత కల్పించే చట్టబద్ధమైన హక్కులని అన్నారు. రాబోయే తరాలు కూడా తమ ఇంటిపై గర్వంగా హక్కు ప్రకటించుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే నాయకత్వానికి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు పనిచేసే నాయకత్వానికి ఎంతో తేడా ఉంటుందని, .మహబూబ్‌నగర్ నగరంలో గతంలో జరిగిన అక్రమాలు, ఆక్రమణలు, బెదిరింపులు, అక్రమ కేసులకు సంబంధించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారాలు చూపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

పేదరికానికి కులం, మతం ఉండవని, అన్ని వర్గాల పేదలకు సమానంగా న్యాయం చేయడమే నిజమైన ప్రజాసేవ అని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ నగరాన్ని ఒక కుటుంబంగా భావించి, ప్రజలందరి అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. 523 సర్వే నంబర్ పరిధిలోని కాలనీని మహబూబ్‌నగర్‌లోనే ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇళ్ల పట్టాల పంపిణీతోనే తమ బాధ్యత పూర్తికాదని, కాలనీలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని అన్నారు. కాలనీ అభివృద్ధి కోసం త్వరలో రూ.2 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల వంటి సదుపాయాలు అందుబాటులో లేని పక్షంలో వాటిని కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌గారితో చర్చిస్తున్నట్లు వెల్లడించారు. నగర ప్రజలు మురుగునీటి సమస్యలతో అనారోగ్యానికి గురికాకుండా రూ.603 కోట్లతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అమలైతే నగరంలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మహబూబ్‌నగర్‌ను సుందరమైన, ఆదర్శవంతమైన నగరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక విద్య, ఉపాధి, సాగునీరు ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని గుర్తు చేసిన ఆయన , పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, వారు ఉన్నత స్థానాలకు చేరుకునేలా అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పిల్లల భవిష్యత్తును మెరుగుపరిచేందుకు అవసరమైన నిధులు ఖర్చు చేయడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం సమీపంలో ప్రతిపాదించిన కూరగాయలు, మాంసాహార మార్కెట్‌ను మరో అనువైన ప్రాంతానికి తరలించి, ఆ స్థలంలో పూలే--అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. వేలాది మంది విద్యార్థులకు ఉపయోగపడేలా రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచే గ్రంథాలయాన్ని నిర్మించాలన్నది తమ లక్ష్యమని తెలిపారు.

మహబూబ్‌నగర్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.70 కోట్లు మంజూరు చేయించామని, మొదటి దశలో రూ.20 కోట్లతో పనులు ప్రారంభించామని చెప్పారు. ఎంవీఎస్ జూనియర్ కళాశాల పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మిస్తున్నామని, సుమారు 2,000 మంది విద్యార్థులు నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునేలా



ఆ విద్యాసంస్థను తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. గర్ల్స్ జూనియర్ కళాశాల కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నడిగడ్డలోని ఒకేషనల్ కళాశాల అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించి ఆధునిక సదుపాయాలు కల్పించామని, పక్కనే ఉన్న జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి మరో రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఐటీఐల్లో ఆధునిక సాంకేతిక విద్య అందించేందుకు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న 10 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో రెండింటిని మహబూబ్‌నగర్‌కు తీసుకొచ్చామని సుమారు రూ.68 కోట్లతో ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేసి, టాటా గ్రూప్ సహకారంతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో సుమారు 95 శాతం మందికి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను సాధించేందుకు విద్య, జ్ఞానం అత్యంత ముఖ్యమని ఎమ్మెల్యే అన్నారు. ఒక కుటుంబం విద్య ద్వారా అభివృద్ధి చెందితే, దానిని చూసి మరో వెయ్యి కుటుంబాలు స్ఫూర్తి పొందుతాయని పేర్కొన్నారు. పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, పారిశ్రామికవేత్తలుగా, ఇతర ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, భవిష్యత్తు తరాలు మెరుగైన జీవితాన్ని గడిపేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, కష్టాల్లో అండగా నిలవడం, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే నిజమైన రాజకీయమని అన్నారు. వచ్చే ఎన్నికల గురించి మాత్రమే కాకుండా, వచ్చే తరాల భవిష్యత్తు కోసం పనిచేసే నాయకులే చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగర అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి, విద్యార్థుల భవిష్యత్తుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

లి కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి మాట్లాడుతూ క్రిస్టియన్‌పల్లిలో గత తొమ్మిది, పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యను పరిష్కరించి, అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందించడం సంతోషంగా ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించి అర్హులకు న్యాయం చేయాలని నిర్ణయించిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారి ప్రత్యేక చొరవతో జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇందులో భాగంగా క్రిస్టియన్‌పల్లిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించి, లబ్ధిదారులకు వారి ఇళ్లపై హక్కులు కల్పించగలిగామని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అందజేసిన పట్టాలు వారి హక్కులకు నిదర్శనమని, ఇళ్లకు సంబంధించిన సమస్యలు పరిష్కారమై హక్కులు లభించడం ఆనందదాయకమని అన్నారు. లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న సంతోషం జిల్లా యంత్రాంగానికి సంతృప్తినిస్తోందని తెలిపారు. కుటుంబ సభ్యులందరూ ఈ ఆనందంతో బతుకమ్మ, దసరా పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రిస్టియన్‌పల్లిలో ఇంకా ఏవైనా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటే జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పట్టాల పంపిణీ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ జి. మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, 10వ డివిజన్ కార్పొరేటర్ రమేష్, తో పాటు ఇతర కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో లో ఘనంగా బతుకమ్మ సంబురాలు!

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక - సర్పంచ్ పెరిక నాగేశ్వరావు

తల్లాడ, అక్టోబర్ 16 ప్రజా కలం న్యూస్: తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరావు ఆధ్వర్యంలో గ్రామంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో ఉత్సాహంగా సంబురాలు జరుపుకున్నారు. మహిళల సందడి, బతుకమ్మ పాటలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక నాగేశ్వరావు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా ఒకచోట చేరి ఆనందంగా పండుగను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకత అని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతిని ప్రేమించి, పర్యావరణాన్ని పరిరక్షించాలనే గొప్ప సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ వాటి గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. తల్లాడ గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబురాలను ఆనందోత్సాహాల



మధ్య జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తల్లాడ గ్రామం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధితో విలసిల్లాలని సర్పంచ్ పెరిక నాగేశ్వరావు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో డి ఎల్ పి వో విజయ లక్ష్మి, తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి,ఎంపీడీఓ అంబటి శ్రీధర్ రాజు, ఎంపీవో శ్రీహరి క్రిష్ణ,ఎంపీడీఓ ఆఫీస్ సుపరిడెంట్ వాణి, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మ రెడ్డి, వార్డు మెంబెర్ శీలం నాగమణి, అమర్లపూడి సీతారాములు, గ్రామ పంచాయతీ సిబ్బందిలు తదితరులు పాల్గొన్నారు

కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పనిచేయాలి

- తాగునీరు, వైద్యం, రవాణా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబరు 16 (ప్రజాకలం):

చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలోని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో నవంబరు 10 నుంచి 25 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా వివిధ శాఖలు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా..

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నిరంతర నీటి సరఫరా చేయడంతోపాటు అవసరమైన రోజుల్లో ట్యాంకర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, షవర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

24 గంటలు వైద్య సేవలు

జాతర ప్రాంగణంలో 24 గంటలూ వైద్య సేవలు అందేలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరమైన మందులు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఘాట్ రోడ్డుపై వాహనాలకు అనుమతి లేదు

భక్తుల భద్రతకు పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఘాట్ రోడ్డు పనులు కొనసాగుతున్నందున కొండపైకి వాహనాలను అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దొంగతనాల నివారణకు నిరంతర నిఘా, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి సిద్ధం చేయాలని సూచించారు.

రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి

జాతర మార్గాల్లో ప్యాచ్‌వర్క్, రహదారి మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధుల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నవంబరు 16న జరిగే ఉద్దాల ఉత్సవం సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని



సూచించారు.

విద్యుత్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

జాతర సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణకు అదనపు సిబ్బందిని నియమించి, తగిన సంఖ్యలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

కురుమూర్తిని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి

శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని భవిష్యత్తులో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల సౌకర్యార్థం కాటేజీలు, కల్యాణ మండపం తదితర వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి బ్రహ్మోత్సవాలను సమర్థంగా నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. జాతర ప్రాంగణంలో వివిధ శాఖల సమన్వయం కోసం ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు అవసరమైన సమాచారం అందేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, అదనపు కలెక్టర్లు జె.ఎల్.బి. హరిప్రియ, అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, డీఆర్వో ఏ. నిర్మల, దేవాలయ చైర్మన్ బత్తుల బాలరాజు, ఆర్డీవో నవీన్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, దేవాలయ ఈవో మదన్‌రెడ్డి, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ్ యూత్ దుర్గా భవాని మండపంలో ఘనంగా కుంకుమార్చన

17వ వార్డు మహిళల భాగస్వామ్యంతో ప్రత్యేక పూజలు

గజ్వేల్, అక్టోబర్ 16 (ప్రజా కలం ప్రతినిధి)

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గజ్వేల్ పట్టణంలోని 17వ వార్డు పటేల్ బజార్ కాలనీలో ఆదర్శ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా భవాని మండపం వద్ద గురువారం ఆరవ రోజు కుంకుమార్చన కార్యక్రమాన్ని



భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీవాసులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేశారు. దీంతో మండపం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోఎర్రవాడ బాలకృష్ణ, నర్సింలు,స్వామి,కర్ణాకర్,చిన్న స్వామి,17వ వార్డు కాలనీవాసులు, మహిళలు, భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో లలితా త్రిపుర సుందరీ దేవిగా దుర్గామాత దర్శనం- ఆలయ చైర్మన్ అల్లే కుమార్

మహేశ్వరం, అక్టోబర్ 15 (ప్రజా కలం):

మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ శివగంగ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని ఆలయ చైర్మన్ అల్లే కుమార్ తెలిపారు. మంగళ వారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలం కారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఎరుపు పట్టుచీరలో సర్వాలంకార భూషితంగా తీర్చిదిద్దారు. గర్భగుడిని పూలతో శోభాయమానంగా అలంకరించా రు. ఉదయం నుంచి లలితా సహస్ర నామ పారాయణ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ అలంకార దర్శనంతో సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అమ్మవారి అలంకారాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



వార్డు సభ్యులకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందజేత

గజ్వేల్ రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం

గజ్వేల్, అక్టోబర్ 16 (ప్రజా కలం ప్రతినిధి):

గ్రామపంచాయతీ పాలన, విధులు,బాధ్యతలు,గ్రామాభివృద్ధిపై నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీల పాలనను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించేలా ఆర్‌జీఎస్ఏ, టీజీఐఆర్‌డీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గజ్వేల్ మండలం దాతర్‌పల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు,ఉపసర్పంచ్ శిక్షణ పూర్తి చేసుకోవడంతో ఎంపీడీవో మహేష్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. శిక్షణ ద్వారా గ్రామపంచాయతీ పాలనకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన పెరిగిందని ప్రజాప్రతినిధులు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాభివృద్ధికి,ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వినియోగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించి,శిక్షణ విజయవంతం కావడానికి తోడ్పడిన దాతర్‌పల్లి గ్రామ కార్యదర్శి నాగరాజుకు గ్రామ పాలకవర్గం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



గజ్వేల్ మహాంకాళి ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

-500 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో విశేష పూజలు.

-చండిక అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



గజ్వేల్, అక్టోబర్ 16
(ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ పట్టణంలోని శ్రీ మహాంకాళి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సుమారు 500 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీ మహాలక్ష్మి,శ్రీ మహాసరస్వతి సమేతంగా కొలువుదీరిన మహాంకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ పురోహితుడు నంద బాలశర్మ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పాత ఆలయం స్థానంలో ధర్మకర్తల మండలి,సుమారు 50 మంది శాశ్వత సభ్యులు,స్థానిక భక్తుల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మానసాదేవి, రాజశ్యామలాదేవి, శ్రీ కాలభైరవ స్వామి విగ్రహాలను సైతం ప్రతిష్ఠించినట్లు వివరించారు. ప్రతి ఏటా శరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు విజయదశమి రోజున శమీ పూజ, మరుసటి రోజు సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి మంగళవారం స్థానిక మహిళలు సౌందర్యలహరి, శివానందలహరి,మణిద్వీప వర్ణన పారాయణాలతో అమ్మవారిని కొలుస్తున్నారని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు చండిక అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా,మూలా నక్షత్రం సందర్భంగా పుస్తక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్‌కర్ పద్మాబాయి నర్సింగరావు,కౌన్సిలర్లు కప్ప మమత పోచయ్య, నాయిని నత్యలక్ష్మి యాదగిరి,బొగ్గుల సురేష్ స్వప్న, కప్ప భాస్కర్,హనుమండ్ల నాగరాజు నేత,అల్వాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన లక్ష్మీ నర్సింహా రెడ్డి



కడ్తాల్, అక్టోబర్ 15, (ప్రజా కలం)

కడ్తాల్ మండల కేంద్రంలో దుర్గామాత మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ సన్నిధిని బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహా రెడ్డి సందర్శించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లోకకల్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, రాష్ట్ర సుభిక్షం కోసం అమ్మవారికి పూజలు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలని కోరారు. దుర్గమ్మ ఆశీస్సులతో వర్షాలు విరివిగా కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. దుర్గామాత కృపతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ గంపా వెంకటేష్ గుప్తా,ఉత్సవ కమిటీ అధ్యక్షులు కరుణాకర్, హనుమాన్ యూత్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి,కంటేకార్ తిరుమలేష్,జగత్ రెడ్డి, రవీందర్ రెడ్డి,మాధారం మహేష్,సాయి ప్రభు,యాదగిరి,శ్యామ్ సుందర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఇద్దరికి జైలు.

ఒకరికి 2 రోజులు, మరొకరికి 3 రోజుల జ్యుడీషియల్ రిమాండ్.

రాయపోల్ ఎస్ఐ బి. లింగం.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 16.

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి న్యాయస్థానం జైలు శిక్ష విధించినట్లు రాయపోల్ ఎస్ఐ బి. లింగం తెలిపారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరిని న్యాయస్థానంలో హాజరుపరచగా, ఒకరికి రెండు రోజులు, మరొకరికి మూడు రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారికి జైలు శిక్షతో పాటు రూ.10 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని సూచించారు.




శ్రీరాములు యాదవ్‌ను కలిసిన రవీందర్ నాయక్

మంఖాల్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: అందెల

మహేశ్వరం, అక్టోబరు 16 (ప్రజాకలం): మంఖాల్ 67వ డివిజన్ నూతన బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన మెగావత్ రవీందర్ నాయక్ పార్టీ ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా శ్రీరాములు యాదవ్‌కు శాలువా కప్పి సత్కరించి, డివిజన్ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ మంఖాల్ డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు రవీందర్ నాయక్ కృషి చేయాలని సూచించారు. ప్రతి బూత్‌ను పటిష్ఠం చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని, పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలని పిలుపునిచ్చారు. డివిజన్ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు.



కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికొండ నర్సింగ్‌రాజ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బాకీ విలాస్ శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసంలో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలు

కూకట్ పల్లి, అక్టోబర్ 16, ప్రజా కలం ప్రతినిధి:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు కూకట్‌పల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసంలో ఆయన కుమార్తె కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో పండుగ సందడిని నింపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పూల పండుగగా పేరుగాంచిన బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందిస్తూ పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి.



పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి - నర్వ పవన్

నర్వ పవన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి కార్మికులకు చీరల పంపిణీ

కూకట్ పల్లి, అక్టోబర్ 16, ప్రజా కలం ప్రతినిధి:

దసర పండుగను పురస్కరించుకొని కెపిహెచ్‌బి కాలనీ నాలుగవ ఫేజ్‌లో నర్వ పవన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు నర్వ పవన్ మాట్లాడుతూ కాలనీ పరిశుభ్రత కోసం, ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికుల కష్టాన్ని గుర్తించి, పండుగ సంతోషాన్ని వారితో పంచుకోవడమే నిజమైన దసరా అని, తమ ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు పారిశుద్ధ్య కార్మికులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కామేశ్వరరావు, వెంకటరమణ యాదవ్, తోట రమేష్, యాదవ రెడ్డి, రేవతి, నాగలక్ష్మి, స్వర్ణ, హరిబాబు, నాగార్జున, మంచాల సాయి, అరుణ్, సురేంద్ర, భరత్ తదితరులు పాల్గొన్నారు.



క్రేన్ రూపంలో మృత్యువు.. కార్మికుడి బలి

గౌరారం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. భర్త మృతి, భార్యకు స్వల్ప గాయాలు

గజ్వేల్, అక్టోబర్ 16 (ప్రజా కలం ప్రతినిధి):

వేగంగా దూసుకొచ్చిన క్రేన్ రూపంలో మృత్యువు ఓ కార్మికుడి ప్రాణాలను బలిగొంది. విధులు ముగించుకుని భార్యతో కలిసి ఇంటికి వెళ్తున్న వ్యక్తిని క్రేన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద ఘటన గౌరారం గ్రామ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ జె.ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణానికి చెందిన గుండ్ల నరేష్ (38), తండ్రి మనోహర్, తన భార్య గుండ్ల నవనీతతో కలిసి గౌరారం పరిధిలోని శ్రవ్య టెక్స్‌టైల్స్ కంపెనీలో కూలీలుగా పనిచేస్తున్నారు. రోజువారీ విధుల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం సుమారు 6 గంటలకు పని ముగించుకుని వర్గల్ కమాన్ బస్టాప్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో నాగార్జున కంపెనీ దాటిన తర్వాత వర్గల్ నుంచి గౌరారం వైపు వస్తున్న క్రేన్ డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ నరేష్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన పక్కనే ఉన్న భార్య నవనీతకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై గౌరారం పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



మోర్తాడ్ బాధితులకు

వేముల భరోసా

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 16:

మోర్తాడ్ మండల కేంద్రంలో అనారోగ్యం, ప్రమాదాల బారిన పడిన పలువురు బాధితులను, మృతుల కుటుంబాలను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం పరామర్శించారు.

ఇటీవల గల్ఫ్ నుంచి అనారోగ్యంతో తిరిగి వచ్చి చికిత్స పొందుతూ మరణించిన దళిత యువకుడు మోత్కు జీవన్ కుటుంబాన్ని ఆయన సందర్శించారు. మృతుడి భార్యాపిల్లలను ఓదార్చి, ధైర్యం చెప్పారు. అనంతరం ఆ కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే, ఇటీవల మరణించిన కుదురపాక నరేష్, రాజుల తల్లి మృతికి సంతాపం వ్యక్తంచేస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మరోవైపు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆర్ఎంపీ వైద్యుడు అశోక్, అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకుడు నాకిడి శ్రీకాంత్‌లను కలిసి ఎమ్మెల్యే యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు....

క్షేత్రస్థాయిలో పార్టీని అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు

- గాంధీ భవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ఆధ్వర్యంలో నియామకాలపై ప్రత్యేక సమీక్ష
-గాంధీభవన్ సమావేశంలో పాల్గొన్న
తోటకూర వజ్రేష్ యాదవ్, పలు డివిజన్ల అధ్యక్షులు

మేడ్చల్/మేడిపల్లి అక్టోబర్ 16(ప్రజాకలం న్యూస్) మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేయడమే లక్ష్యంగా జిల్లా




కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ కీలకంగా ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా గాంధీ భవన్‌లో శుక్రవారం ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశాల్లో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ నేతలతో పాటు,బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ పలు డివిజన్ల అధ్యక్షులు తుంగతుర్తి రవి, బండి శ్రీరాములు, బొమ్మాక్ కళ్యాణ్ నాయకులు సింగిరెడ్డి పద్మారెడ్డి, పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం,డివిజన్ స్థాయి కమిటీల నియామకాలు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. పార్టీ అధిష్ఠానం మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతమైన నాయకత్వాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం,పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై చర్చించారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

రాయరావుపేటలో దుర్గామాతను దర్శించుకున్న గోలి పింగల్‌రెడ్డి


బీబీనగర్, అక్టోబర్ 16 (ప్రజాకలం): మండలంలోని రాయరావుపేట గ్రామపంచాయతీ సమీపంలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారిని శుక్రవారం



కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గోలి పింగల్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొర్ర రమేష్, ఆలయ కమిటీ సభ్యులు రాష్ట్ర నాయకుడు గోలి పింగల్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మన్నె బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి డిప్యూటేషన్ వివాదం

: దళిత ఉద్యోగికి న్యాయం చేయాలని పాలకవర్గ సభ్యుల విజ్ఞప్తి





నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 16:

ఆర్మూర్ డివిజన్ పరిధిలోని జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి డిప్యూటేషన్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది ఇటీవల సాధారణ బదిలీపై జక్రాన్‌పల్లికి వచ్చిన పంచాయతీ కార్యదర్శి సౌడ రంజిత్ కుమార్‌ను మరో ప్రాంతానికి డిప్యూటేషన్‌పై పంపించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి పార్వతి రాజేశ్వర్ ఈ విషయంలో తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై నిషేధం అమలులో ఉన్నప్పటికీ, సాధారణ బదిలీపై వచ్చిన ఉద్యోగిని కేవలం నాలుగు నెలల కాలంలోనే తిరిగి మరో ప్రాంతానికి డిప్యూటేషన్‌పై పంపించే ప్రయత్నాలపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో, సౌడ రంజిత్ కుమార్‌ను జక్రాన్‌పల్లిలోనే కొనసాగించాలని, ఆయన డిప్యూటేషన్ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు.

సౌడ రంజిత్ కుమార్ ఈ వ్యవహారంపై పంచాయతీ కార్యదర్శి సౌడ రంజిత్ కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తాను జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి బాధ్యతలు చేపట్టి కేవలం నాలుగు నెలలే అవుతోందని, ఇంత తక్కువ సమయంలోనే తనను మరో ప్రాంతానికి బదిలీ చేసేందుకు ప్రయత్నించడం వల్ల మానసిక ఇబ్బందులకు గురవుతున్నానని పేర్కొన్నారు. తాను ప్రస్తుతం పనిచేస్తున్న స్థానంలోకి మరో కార్యదర్శిని డిప్యూటేషన్‌పై తీసుకురావాలనే ప్రయత్నాలను ఆపాలని, తన పనితీరును పరిగణనలోకి తీసుకొని జక్రాన్‌పల్లిలోనే కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దళిత ఉద్యోగికి న్యాయం చేయాలి తాను దళిత కుటుంబానికి చెందిన వ్యక్తినని, తనకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో స్పందించాలని రంజిత్ కుమార్ కోరారు. ఉద్యోగుల పనితీరు, నిబంధనలు, పరిపాలనా అవసరాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని తుది నిర్ణయం తీసుకోవాలని గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు అధికారులను కోరుతున్నారు. ఈ వివాదంపై జిల్లా ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారనేది ఇప్పుడు మండలంలో ఉత్కంఠ రేపుతోంది.

స్వర్ణకారుల వృత్తి పరిరక్షణే ధ్యేయం

- నందిపేట్‌లో 'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ
- ఈ నెల 24న సరూర్ నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి (అక్టోబర్ 16:

స్వర్ణకారుల సమస్యల పరిష్కారం, వృత్తి పరిరక్షణే ధ్యేయంగా ఈ నెల 24వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్ స్వర్ణకార శంఖారావం' భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు తంగానపల్లి శ్రీనివాస్, అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరాం మహిపాల్ చారి పిలుపునిచ్చారు. గురువారం నందిపేట్ మండల కేంద్రంలో ఈ సభకు సంబంధించిన గోడ పత్రికను (పోస్టర్) వారు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 24/10/2026 (శనివారం) సాయంత్రం 4:00 గంటలకు హైదరాబాద్ ఎల్బీ నగర్‌లోని సరూర్ నగర్ స్టేడియంలో ఈ భారీ బహిరంగ సభ జరగనుందని తెలిపారు.

స్వర్ణకారుల న్యాయమైన డిమాండ్లను సాధించుకోవడానికి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈ సభను ఒక వేదికగా మలచుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అలాగే రాష్ట్రం నలుమూలల నుంచి స్వర్ణకారులు, విశ్వబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేసి, హక్కులను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా కార్యదర్శి బంధనకంటి నరసింహ చారి, నాయకులు శ్రీరాం సుదర్శన్, మంచిర్యాల శ్రీనివాస్, తాడూరి నరేష్, తాడూరి ధర్మరాజ్, బంగారు నవీన్, శ్రీరామోజు ముత్యం తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం నియోజకవర్గంలో


ప్రజా పోరాటానికి దక్కిన విజయం

- మీర్‌పేట్ ప్రశాంతి హిల్స్ రోడ్డు మరమ్మత్తులు పూర్తి
- బీజేవైఎం స్టేట్ కార్యవర్గ సభ్యులు చింతల రాఘవేందర్ ముదిరాజ్



మహేశ్వరం, అక్టోబర్ 15,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని మీర్‌పేట్ ప్రశాంతి హిల్స్ ప్రధాన రహదారి గత కొంతకాలంగా పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రజా సమస్యను గుర్తించి 01 ఆగస్టు నాడు జిహెచ్ఎంసి కమిషనర్ బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వినతి పత్రం అందజేయడం జరిగిందని బీజేవైఎం స్టేట్ కార్యవర్గ సభ్యులు చింతల రాఘవేందర్ ముదిరాజ్ తెలిపారు. రోడ్డు మరమ్మత్తులు వెంటనే చేపట్టకపోతే పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని అధికారులను హెచ్చరించడం జరిగింది. దీనిపై సానుకూలంగా స్పందించిన జిహెచ్ఎంసి అధికారులు 45 రోజుల గడువు కోరారు. ఇచ్చిన మాట ప్రకారం 45 రోజులలోపే రోడ్డు మరమ్మత్తు పనులను పూర్తి చేయడం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి, సహకరించిన జిహెచ్ఎంసి అధికారులకు బడంగ్‌పేట్ సర్కిల్ సిబ్బందికి చింతల రాఘవేందర్ ముదిరాజ్ ధన్యవాదాలు తెలిపారు.



ముంబైలో గంగపుత్రుల బతుకమ్మ సంబురాలు

నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 16:

బుధవారం, ముంబై తెలుగు బెస్త గంగపుత్ర సమాజ్ – గోరేగావ్ ఆధ్వర్యంలో గోరేగావ్ పశ్చిమంలో తీన్ డోంగ్రి లోగల పోచమ్మ గుడి నుంచి



మరియమ్మ ఆలయం ప్రాంగణం వరకు మహిళలు బతుకమ్మ ను నెత్తి పై ఎత్తుకొని ఊరేగింపుగా కొనసాగారు. వాటిని మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో సంబురాలు జరిపారు. గత ఇరవై ఏళ్ల నుంచి ఇట్టి సంబురాలు జరుపుతున్నామని, బతుకమ్మ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక, తమ ప్రకృతి పండుగను మహారాష్ట్ర భూమిపై జరపడం సంతోషకరంగా ఉందని "సమాజ్" ప్రముఖులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సమాజ్ నాయకులు మహిళలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేశారు. ఈ మేరకు "సమాజ్" నిర్వాహకులు అతిథులైన బహుజన నాయకులు నాగసేన్ మాలజీ, కాశయ్య మహారాజ్, యాకారి అలివేలు, జీ.శంకర్, ఎం.మాలజీ గార్లను శాల్వ కప్పి సన్మానించారు. ఈ ఉత్సవంలో ఎరవేణి దేవక్క, మెంగు లక్ష్మి, లక్కంపెల్లి రాజేశ్వరి, గరిగే సత్యవ్వ, మంగిలిపెల్లి కన్యాకుమారి, మైలారం జమున, నాగుల జమున, గడ్డి పుష్పలత, మాదాస్ మల్లీశ్వరి, నాగుల లక్ష్మి, మాదాస్ లక్ష్మి, దీటి మల్లీశ్వరి, గరిగే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై అఘాయిత్యం

: నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 16:

మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు కాలే పండురంగాకు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ జిల్లా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్ తీర్పునిచ్చారు.

పోలీసుల కథనం ప్రకారం.. 2021 మార్చి 18న నిజామాబాద్ జిల్లా పరిధిలో నివాసముండే ఓ మైనర్ బాలిక తన ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా,



నిందితుడు పండురంగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నిజామాబాద్ పోలీసులు పక్కా ఆధారాలు, సాక్ష్యాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి ఐపీసీ సెక్షన్ 376(AB) కింద 20 ఏళ్లు, పోక్సో చట్టం సెక్షన్ 5(m) r/w 6 కింద మరో 20 ఏళ్ల కఠిన జైలు శిక్షను ఖరారు చేశారు.


కమిషనర్ హెచ్చరిక:

మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. హెచ్చరించారు. బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, పిల్లలపై జరిగే అఘాయిత్యాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

దుర్గామాతను దర్శించుకున్న మాజీ మేయర్లు జక్క వెంకట్ రెడ్డి, తోటకూర అజయ్ యాదవ్,

మేడిపల్లి అక్టోబర్ 16(ప్రజాకలం న్యూస్)

దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బోడుప్పల్, పీర్జాదిగూడ డివిజన్లలోని పలు కాలనీలలో ఏర్పాటుచేసిన దుర్గమాత విగ్రహాలను మాజీ మేయర్లు



జక్క వెంకట్ రెడ్డి, తోటకూర అజయ్ యాదవ్ లు సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఐక్యత, ఆధ్యాత్మికతకు ప్రతీకలని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి,సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





మళ్లీ సర్వే చేయండి..

అర్హులకు న్యాయం చేయండి
మహాదేవపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై అధికారులకు వినతి

బీబీనగర్, అక్టోబర్ 16 (ప్రజాకలం):

నిరుపేదలకు అందాల్సిన ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో పక్షపాతానికి తావులేకుండా, నిజమైన అర్హులను గుర్తించి న్యాయం చేయాలని మహాదేవపూర్ గ్రామానికి చెందిన నాయకులు డిమాండ్ చేశారు. ఇళ్ల కేటాయింపులపై మరోసారి సమగ్ర సర్వే నిర్వహించాలని కోరుతూ శుక్రవారం బీబీనగర్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి,ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి లకు వినతిపత్రం అందజేశారు.ఇల్లు లేని నిరుపేదలు, శిథిలావస్థలోని ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను గుర్తించకుండా ఇళ్ల కేటాయింపులు చేపడితే అర్హులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఉద్దేశించినదని, అలాంటి పథకంలో రాజకీయ జోక్యానికి, పక్షపాతానికి తావివ్వరాదని స్పష్టం చేశారు.అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, అర్హతల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. కేటాయింపుల్లో పారదర్శకత పాటించి, నిజమైన పేదలకు ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ బీబీనగర్ మండల అధ్యక్షుడు పచ్చిమట్టల వంశీగౌడ్, మాజీ వార్డు సభ్యుడు మునిగాల మధు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

బీబీనగర్, అక్టోబర్ 16 (ప్రజాకలం): అర్హులైన ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేస్తోందని గ్రామ సర్పంచ్ సిద్ధగోని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం రాఘవపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందజేశారు.




ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సిలివేరు కవిత మహేష్, వార్డు సభ్యులు దొంతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, జక్కి నగేష్, తోరుపునూరి రవి, న్యాలపట్ల అజయ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత, విఆర్ఏ రాజమణి, రేషన్ డీలర్ వసంత, గ్రామ పెద్దలు,మహిళలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ప్రపంచ అనాటమీ దినోత్సవం

వైద్య విద్యలో శరీర నిర్మాణ శాస్త్రం కీలకం



బీబీనగర్, అక్టోబరు 15 (ప్రజాకలం): బీబీనగర్ ఎయిమ్స్‌లోని అనాటమీ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ అనాటమీ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య విద్యార్థుల్లో శరీర నిర్మాణ శాస్త్రంపై అవగాహన, పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించేలా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ అమిత అగర్వాల్ మాట్లాడుతూ వైద్య విద్యలో ఆసక్తి, బృంద స్ఫూర్తి ఎంతో ముఖ్యమని తెలిపారు. శవ విచ్ఛేదనం ద్వారా మానవ శరీర నిర్మాణంపై లోతైన అవగాహన పొందాలని విద్యార్థులకు సూచించారు. జాతీయ స్థాయి ఈ-పోస్టర్ పోటీ 'అనాటోఆర్ట్', శరీర నిర్మాణంలో గుర్తించిన వైవిధ్యాలను శాస్త్రీయ వ్యాసాలుగా రూపొందించి ప్రచురించడంపై అవగాహన కల్పించే 'అనాటోస్క్రిప్ట్ బూట్ క్యాంప్' నిర్వహించారు. పోటీల్లో విజేతలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డీన్ (అకడమిక్స్) అభినందించి సత్కరించారు. వైద్య విద్యార్థుల శిక్షణకు తమ దేహాలను దానం చేసిన దాతల సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో అనాటమీ విభాగం అధ్యాపకులు, ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శించి,

కుటుంబానికి ఆర్థిక సహాయం

- శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్ట వీరేష్ యాదవ్



భూదాన్ పోచంపల్లి
అక్టోబర్ 16 (ప్రజా కలం)

ఇటీవల బీబీనగర్ – ఘట్‌కేసర్ మధ్య కొండమడుగు వద్ద జరిగిన విషాద ఘటనలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని జూలూరు అలీనగర్‌కు చెందిన గొర్రెల కాపరి బాలాబోయిన కిష్టయ్య ఆయన కుమారులు బాలయ్య, శేఖర్ లకు చెందిన సుమారు 500 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గురువారం ఈ విషయం తెలుసుకున్న శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్ట వీరేష్ యాదవ్, జిల్లా కమిటీ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పోచంపల్లి మండలం జూలూరు అలీనగర్‌కు చెందిన నిరుపేద గొర్రెల కాపరి బాలాబోయిన కిష్టయ్య కుటుంబానికి జరిగిన నష్టం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా కమిటీ అధ్యర్యంలో 32100/- రూపాయలు వారి కుటుంబానికి అందచేయడం జరిగింది.

ఈ సందర్భంగా శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్ట వీరేష్ యాదవ్ మట్లాడుతు గొర్ల కాపరి కిష్టయ్య కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మంత్రి ఈ సంఘ టన గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో పోచంపల్లి మండలం జిల్లకుల్లి గ్రామ ఉపసర్పంచ్ ఆర్ల లింగస్వామి యాదవ్, మాజీ కౌన్సిలర్ వడిచర్ల కృష్ణ యాదవ్,జిల్లా ఉపాధ్యక్షులు గుండెబోయిన సురేష్ యాదవ్, భువనగిరి పట్టణ అధ్యక్షులు మర్రి పాండు యాదవ్,ఆలీనగర్ యాదవ సంఘం అధ్యక్షుడు ఉడుతల బసవయ్య,జూలూరు యాదవ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి జంగయ్య, జిల్లా యూత్ అధ్యక్షులు ర్యకల రమేష్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి బతుక అశోక్ యాదవ్, బీబీనగర్ మండల యూత్ అధ్యక్షులు పర్వతం రంజిత్ యాదవ్,మండల యూత్ ప్రధాన కార్యదర్శి శ్రీరాం శరత్ యాదవ్,కొత్తపల్లి యాదయ్య,కొత్తపల్లి అచ్చయ్య, గుండేబోని జంగయ్య, మహేష్ యాదవ్ తదితర నాయకులు పాల్గొనారు.

మండల తహసిల్దార్ కార్యాలయంలో

ఘనంగా బతుకమ్మ సంబరాలు

- టీజీ ఆర్ఎస్పీ,టిజిటిపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- గౌరీమాతకు పూజలు నిర్వహించిన బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత, తాహసిల్దార్ రాధ,ఎంపీడీవో శ్యామల



బొమ్మలరామారం,
అక్టోబర్ 16(ప్రజా కలం)

శుక్రవారం రోజున బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బొమ్మలరామారం మండల తాహసిల్దార్ కార్యాలయంలో లో తెలంగాణ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ మరియు టీజీటీఏ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా శాఖల మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై బతుకమ్మలు కనువిందు చేస్తూ,పూల పండుగ ప్రాధాన్యతను చాటాయి. బతుకమ్మ గేయాలను ఆలపిస్తూ మహిళా ఉద్యోగులు,యువతులు, మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆటలాడుతూ ఎంతో ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. దాండియా, కోలాటాలతో బతుకమ్మ సంబురానికి వన్నె చేకూర్చారు.ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యాలయ వనివేళలు ముగిసినప్పటికీ ఉద్యోగినులు ఎవరూ ఇళ్లకు వెళ్లకుండా ఎంతో హుషారుగా ఈ ఉత్సవంలో పాల్గొని బతుకమ్మ వేడుక ఔన్నత్యాన్ని చాటారు

ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ సింగర్తి మల్లేశం,భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు రాజేష్ పైలెట్,సీనియర్ అసిస్టెంట్ శోభారాణి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు కొండం వెంకట్ రెడ్డి, నరేష్ నాయక్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యంజాల కళ,ఏపీవో శ్రీ లక్ష్మి,ఏపిఎం యాదగిరి, జిపిఓలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు,మండల రెవెన్యూ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పిఏసిఎస్ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ 11వ డివిజన్ జనరల్ సెక్రటరీగా మాడుగుల శివ యాదవ్ నియామకం

శివ యాదవ్‌ను ఘనంగా సన్మానించిన నాయకులు, ప్రముఖులు



బోడుప్పల్: అక్టోబర్ 16(ప్రజాకలం న్యూస్)

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా మాడుగుల శివ యాదవ్ నియమితులైన సందర్భంగా పలువురు నాయకులు,ప్రముఖులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని శివ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మల్లారెడ్డి, హరిపాల్ రెడ్డి, బాలరెడ్డి,గిరి, ఫణీందర్, రఘుపతిరెడ్డి, మురళి,యాదగిరి, దామోదర్ రెడ్డి, రాజేష్ గుప్తా, ఆచార్య శ్రీరామ, శ్రీశైలం తదితర ప్రముఖులు హాజరయ్యారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి హాజరై తనను అభినందించిన నాయకులు, ప్రముఖులు, శ్రేయోభిలా షులందరికీ మాడుగుల శివ యాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

పిఆర్టియు రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షునిగా జానకి రాములు ఏకగ్రీవంగా ఎన్నిక

భూదాన్ పోచంపల్లి అక్టోబర్ 16 (ప్రజా కలం)

పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు పిండిగా జానకి రాములు పి ఆర్ టి యు రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్గొండలో నిర్వహించిన పిఆర్టియు రాష్ట్ర కమిటీ సమావేశంలో జానకిరాములను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, పీఆర్టియూ రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



జైనపల్లిలో టిబి నివారణకు ఉచిత వైద్య శిబిరం

120 మందికి ఎక్స్‌రే పరీక్షలు..
80 మంది రక్త నమూనాల సేకరణ

బీబీనగర్, అక్టోబర్ 16 (ప్రజాకలం): క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మండలంలోని జైనపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. కొండమడుగు ప్రాథమిక



ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నక్కిర్తి హేమలత గణేష్ ప్రారంభించారు. పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా 120 మందికి టీబీ అనుమానిత లక్షణాల గుర్తింపునకు స్క్రీనింగ్ నిర్వహించారు. అదేవిధంగా 80 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి, రక్తంలో చక్కెర స్థాయిల పరీక్షలతో పాటు ఇతర సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం భువనగిరి తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌కు పంపించారు. టీబీ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జి.ఆర్. శ్రవణ్ కుమార్, ఉపసర్పంచ్ ఎం. చంద్ర మౌళి, పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి, వార్డు సభ్యులు, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పి. ప్రభాకర్, హెల్త్ సూపర్‌వైజర్ అరుణ, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ శాంతి, ల్యాబ్ టెక్నీషియన్ నర్సయ్య, ఎంపీహెచ్ఏ వెంకట రమణారెడ్డి, ఏఎన్ఎంలు విజయశ్రీ, కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


బీబీనగర్ రైతులకు సాగునీటి భరోసా!

వడపర్తి ఆగ చెరువుకు బస్వాపూర్ జలాలు
రెండు నెలల్లో కాలువ పనులు పూర్తి

బీబీనగర్,అక్టోబర్ 16 (ప్రజాకలం): మండల రైతులకు సాగునీటి సదుపాయం మెరుగుపరిచే దిశగా బస్వాపూర్ హై లెవల్ కెనాల్ నుంచి వడపర్తి ఆగ చెరువుకు నీటిని అందించే కాలువ నిర్మాణ పనులకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్



కుమార్ రెడ్డి శ్రీకారం చుట్టారు. 7.5 కిలోమీటర్ల పొడవున చేపట్టనున్న ఈ పనులను రెండు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కాలువ నిర్మాణం పూర్తయితే బీబీనగర్‌తో పాటు భువనగిరి ప్రాంత రైతులకు సాగునీటి సదుపాయం మెరుగుపడనుంది. వ్యవసాయ భూములకు నీరందించి రైతుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు ఈ పనులు దోహదపడనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా సాగునీటి సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కాలువ పనుల ప్రారంభం చూస్తుంటే దసరా పండుగ నాలుగు రోజుల ముందే వచ్చినంత ఆనందంగా ఉందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో పొట్టోళ్ల శ్యామ్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురకంటి సతిరెడ్డి, సురకంటి సత్తిరెడ్డి,కాంగ్రెస్ నాయకులు దండెం ప్రభాకర్,ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.





ట్రైసా ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

అలంకరణ పోటీల్లో నకిరేకల్ రెవెన్యూ సిబ్బందికి ప్రథమ బహుమతి

నల్లగొండ, సెప్టెంబరు 16 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రైసా) నల్లగొండ డివిజన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నల్లగొండలోని రెవెన్యూ భవన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని, వివిధ రకాల పూలతో బతుకమ్మలను ఆకర్షణీయంగా అలంకరించారు.

కార్యక్రమానికి నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బతుకమ్మ అలంకరణ పోటీల్లో విజేతలకు



బహుమతులు అందజేశారు. పోటీల్లో నకిరేకల్ మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ప్రథమ బహుమతి సాధించారు.

నకిరేకల్ ఇన్‌చార్జి తహసీల్దార్ పెరిక యశ్వంత్‌రాజ్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు సమష్టిగా బతుకమ్మను అలంకరించి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. విజేతలను అధికారులు, ట్రైసా ప్రతినిధులు అభినందించారు.

ఈ సందర్భంగా ఆర్డీవో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు ఉద్యోగుల్లో ఐక్యత, ఆత్మీయతను పెంపొందిస్తాయని తెలిపారు. సంప్రదాయ పండుగలను ఉద్యోగులంతా కలిసిమెలిసి జరుపుకోవడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి, డివిజన్ అధ్యక్షుడు నూకల వెంకట్, ట్రైసా ప్రతినిధి ప్రతాప్‌తో పాటు నల్లగొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మహిళా ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో 'మై క్యూర్'కు మోక్షమెప్పుడు?

- ఫిర్యాదులు పెండింగ్.. పట్టించుకోని అధికారులు
- కమిషనర్ ఆదేశాలకూ స్పందన కరవు
- అక్రమ ప్లెక్సీలపై మౌనం.. ప్రజల్లో అసంతృప్తి

నిజాంపేట్, అక్టోబర్ 16 (ప్రజాకలం):

మున్సిపల్ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన 'మై క్యూర్' యాప్, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో పూర్తిగా నవ్వులపాలవుతోంది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, ప్రగతినగర్‌లో పలు సమస్యలపై ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు కనీసం స్పందించడం లేదు.

కమిషనర్ ఆదేశాలకు తూట్లు..

మున్సిపల్ అధికారులు నిరంతరం ప్రజల్లోనే ఉంటూ స్థానిక సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాలని సీఎంసీ కమిషనర్ జి. సృజన స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, నిజాంపేట్ సర్కిల్ అధికారులు వాటికి నిలువునా తూట్లు పొడుస్తున్నారు.

ప్రగతినగర్ శానిటరీ ఇన్స్పెక్టర్ నితిన్ కుమార్ సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, రోజుకో కట్టుకథ చెబుతూ కాలక్షేపం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అటు ఏఈ శరణ్ తేజ, ఇటు డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీలు సైతం ప్రజాసమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

అక్రమ ప్లెక్సీల రాజ్యం..

ప్రగతినగర్ ప్రధాన రహదారులు, అంతర్గత కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా అక్రమ ప్లెక్సీలు వెలుస్తున్నా మున్సిపల్ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజల ఇబ్బందులతో మాకేం పని అన్నట్లు వ్యవహరిస్తున్న అధికారులు, నేతల మెప్పు పొందేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

స్పందించని వైనం.. చర్యలకు డిమాండ్:

ఈ సమస్యలపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా, శానిటరీ సూపర్‌వైజర్ నితిన్ కుమార్ తాను సార్ డ్యూటీలో ఉన్నానంటూ

TELANGANA RISING CURE - PURE - RARE
MyCURE MOBILE APP

సమాధానం దాటవేయగా, ఎస్‌డబ్ల్యూఎం ఏఈ శరణ్ తేజ కనీసం అందుబాటులోకి రాకపోవడం వీరి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.

ఇప్పటికైనా సీఎంసీ కమిషనర్ జి. సృజన, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌లు నేరుగా జోక్యం చేసుకుని, ప్రజల సమస్యలను గాలికొదిలేస్తున్న నిజాంపేట్ సర్కిల్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మై క్యూర్ యాప్ ద్వారా నమోదైన పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అమీన్‌పూర్‌లో కొత్త రుచులు.. నాణ్యతకు పెద్దపీట..

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా మురారి టిఫిన్స్ ప్రారంభం.. నాణ్యతే లక్ష్యం..

పటాన్‌చెరు, అక్టోబర్ 16 (ప్రజా కలం) ప్రతినిధి

అమీన్‌పూర్‌లో ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన, రుచికరమైన అల్పాహారాన్ని అందించడమే లక్ష్యంగా నూతనంగా ఏర్పాటు చేసిన మురారి టిఫిన్స్ కేంద్రం ప్రారంభమైంది. నాణ్యత, రుచి, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ యజమాని బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ వారి ఆదరణ పొందడమే తమ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రోజువారీ జీవితంలో అల్పాహారానికి ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు యజమాని బ్రహ్మారెడ్డి తెలిపారు. నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి , మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, మల్లేష్ పలువురు ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు..



డీసీసీ అధ్యక్షురాలిగా పారిజాత బాధ్యతల స్వీకారం

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 16 (ప్రజాకలం):

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలిగా నూతనంగా నియమితులైన చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. వేదమంత్రోచ్చారణలు, కాంగ్రెస్ శ్రేణుల సందడితో కార్యక్రమం ఘనంగా జరిగింది. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై పారిజాత నర్సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేందుకు ఆమె నాయకత్వం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అగ్రనాయకత్వానికి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హనుమంతరావు, చల్లా నర్సింహారెడ్డి, పట్నం సునీత మహేందర్‌రెడ్డి, తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, సరిత తిరుపతయ్య, చరణ్ కౌశిక్ యాదవ్, రఘునాథ్ యాదవ్, కాల్వ సుజాత, సామ రామ్మోహన్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. నూతన డీసీసీ అధ్యక్షురాలిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.





కుస్తీ పోటీలకు జీఎంఆర్ చేయూత..

రాష్ట్రస్థాయి అండర్-17 కుస్తీ పోటీల ముగింపు..
విజేతలకు బహుమతుల ప్రదానం..

పటాన్‌చెరు, అక్టోబర్ 16 (ప్రజా కలం) ప్రతినిధి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, పట్టుదల,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు పటాన్‌చెరు మైత్రి



మైదానంలో రెండు రోజులుగా జరిగిన పాఠశాలల క్రీడా సమాఖ్య రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల కుస్తీ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ముగిశాయి.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే విజేతలకు బహుమతులు అందజేశారు.పోటీల నిర్వహణకు తన సొంత నిధులతో సహకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు.విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ నాయక్, విజయ్ కుమార్, హనుమంత్ రెడ్డి, ఎట్టయ్య, పృథ్వీరాజ్, రాజ్ కుమార్, రాము, షకీల్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు..



నందిగామలో గౌడ్ హాస్టల్ ప్రారంభం..

విద్యార్థుల వసతికి కొత్త భరోసా

ఘాట్ కేసర్, అక్టోబర్ 16 (ప్రజా కలం) ప్రతినిధి

విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించి, వారి విద్యాభ్యాసానికి మరింత తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో నిర్మించిన నూతన గౌడ్ హాస్టల్ భవనం అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్,పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నూతన హాస్టల్ భవనం విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించడంతోపాటు, ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యతోపాటు తగిన వసతి సౌకర్యాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు.నూతన భవనం అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు వసతి పరంగా మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు..

మోటారు మరమ్మతులు చేస్తూ విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 16: మోటారు మరమ్మతులు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని రెడ్డి చెరువు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన కల్లూరి ఐలయ్య (60) ప్రైవేటు వెల్డింగ్‌గా పనిచేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన మన్నె చందు తన మోటారు మరమ్మతు చేయాలని కోరడంతో ఐలయ్య రెడ్డి చెరువు వద్దకు వెళ్లారు. మరమ్మతులు పూర్తయిన అనంతరం మోటారును చెరువులో దించుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై చెరువులో పడిపోయారు. ఎంతసేపటికీ ఐలయ్య బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన చందు చెరువులోకి దిగి ఆయనను బయటకు తీశారు. అప్పటికే ఐలయ్య మృతి చెందారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

అక్రమంగా అమర్చిన 12 మోటార్లు స్వాధీనం

కూకట్‌పల్లి జోన్‌లో జలమండలి విజిలెన్స్ అధికారుల తనిఖీలు

హైదరాబాద్ : తాగునీటి సరఫరా పైపులైన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడుకుంటున్న వారిపై జలమండలి విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని డివిజన్–22, గాయత్రీనగర్ వార్డులోని వివేకానందనగర్ కాలనీలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 12 అక్రమ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జలమండలి విజిలెన్స్ బృందం సంబంధిత మేనేజర్‌తో కలిసి ఈ తనిఖీలు చేపట్టింది. తాగునీటి సరఫరా పైపులైన్లకు అక్రమంగా అమర్చిన మోటార్లను గుర్తించి తొలగించారు. తాగునీటి పైపులైన్లకు నేరుగా మోటార్లు బిగించి నీటిని తోడుకోవడం వల్ల ఇతర వినియోగదారులకు సరిపడా నీరు అందకపోవడంతో పాటు సరఫరా ప్రెషర్ తగ్గే అవకాశం ఉందని జలమండలి పేర్కొంది. అక్రమ మోటార్ల వినియోగాన్ని అరికట్టేందుకు తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

పోలీసుల అదుపులో లేడీ డాన్ సులోచన

అన్నమయ్య : జిల్లా కేంద్రంలోని మదనపల్లె, తదితర ప్రాంతాల్లో భూ కబ్జాలు చేసి అమాయకులను మోసం చేస్తూ,14 కేసుల్లో నిందితురాలుగా రౌడీ షీట్ కలిగి ఉన్న లేడీ డాన్ కోనేటి సులోచనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మదనపల్లె పట్టణం నీరుగట్టుపల్లికి చెందిన సులోచనపై ఇప్పటికే మదనపల్లె 1టౌన్, 2టౌన్, తాలూక తదితర పోలీస్ స్టేషన్లలో 14 చీటింగ్ కేసులతో పాటు భూ కబ్జా, హత్యా యత్నం వంటి కేసులు నమోదై ఉన్నాయి. జిల్లా ఎస్పీ ధీరజ్, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డిఎస్పీ ప్రసాద్ ల ఆదేశాలతో వన్ టౌన్ పోలీసులు సులోచనను అదుపులోకి తీసుకున్నారు

ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పోయింది

హైదరాబాద్ : కాక్రోచ్ జనతా పార్టీ నేతల అరెస్టుల వ్యవహారంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ తీరు తెన్నులపై ఘాటు విమర్శలు గుప్పించిన ఆయన, సిజేపీ నేతలకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అంతా జరిగిపోయిన తర్వాత అధికారులతో విచారణలు జరిపించడం, కంటితుడుపు చర్యలకు దిగడం కంటే, నష్టం జరగక ముందే వ్యవస్థలు జాగ్రత్త పడటం ఎంతో మంచిదని జగన్ హితవు పలికారు. ప్రక్షాళన చేయాల్సింది రాజకీయ నేతలను కాదని, లోపభూయిష్టంగా మారిన ఎన్నికల వ్యవస్థనే అని ఆయన ఎక్స్ వేదికగా తేల్చిచెప్పారు. అఫెఖ కీలక నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కేవలం అరెస్టులు, అణచివేత చర్యలతో ఏమీ సాధించలేరని, ఇటువంటి చర్యల వల్ల పరిస్థితి సర్దుమణగకపోగా మరింత దిగజారుతుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తే వ్యవస్థలపై ప్రజల్లో ఉన్న మిగిలిన కాస్త నమ్మకం కూడా పూర్తిగా ఆవిరైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన అశుతోష్, సౌరవ్ దాస్‌లకు తన సానుభూతిని తెలియజేస్తూ ఆయన ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపించడం వల్లనే ఈ తరహా నిరసనలు, ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయని జగన్ తన ట్వీట్‌లో విశ్లేషించారు. ప్రస్తుతం మన వ్యవస్థలోనే పెద్ద లోపం ఉంది. ఎన్నికల వ్యవస్థపై పౌరుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉంది. అంతేగానీ ప్రశ్నించే గొంతులను జైలుపాలు చేయడం పరిష్కారం కాదు అని జగన్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం , ప్రభుత్వ యంత్రాంగాలు పక్షపాత వైఖరిని వీడి, ప్రజాస్వామ్య సూత్రాలను కాపాడాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.
సిజేపీ నేతలకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ చేసిన ఈ ట్వీట్ రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియా వేదికల్లో వైరల్‌గా మారింది. జగన్ మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ సిజేపీ సీనియర్ నేతలు అభిజిత్ దీప్కే, అజింక్య షిండేలు ఆయన ట్వీట్‌ను రీట్వీట్ చేశారు. క్లిష్ట సమయంలో తమ పోరాటానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలవడం భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు కొత్త ఊపిరి పోసిందని పేర్కొన్నారు.

రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలి

పాలకుర్తి: రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలి అని వ్యవసాయాధికారి బండి ప్రమోద్ కుమార్ అన్నారు. ఫుట్నూర్ రైతు వేదికలో రైతులతో సదస్సును నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం, రబీ సాగు ప్రణాళికపై అవగాహన సదస్సు ఫుట్నూర్ సర్పంచ్ తోట ప్రశాంత్ మాట్లాడుతూ రైతులు రాబోవు యాసంగికి వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ యాసంగి ఎల్నినో ప్రభావం తో ఆరుతడి పంటల కే ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు. పాలకుర్తి మండలం ఫుట్నూర్ రైతు వేదికలో నేడు రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోవు యాసంగి సీజన్ కు అవసరమైన విత్తనాలను రైతులు ముందస్తుగా తమ వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం సూపర్ ఎల్ నినో ముప్పు కొనసాగుతున్నందున రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. వాతావరణ మార్పుల వల్ల పంటలపై ఎల్ నినో చూపే ప్రభావం మరియు దానిని తట్టుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి వివరించారు. నీటి వృథాను అరికట్టి, తక్కువ నీటితో అధిక లాభాలనిచ్చే పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని ఈ సందర్భంగా సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎఫ్ పి ఓ ప్రమోషన్ క్యాంపెయిన్ మరియు రైతు రిజిస్ట్ర క్యాంపెయిన్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు తప్పనిసరిగా రైతు ఐడీని నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి పిఎసిఎస్ సిబ్బంది, మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ ,వ్యవసాయ విస్తరణ అధికారి కె. శ్రీకాంత్ , పుట్నూరు సర్పంచ్ తోట ప్రశాంత్ మరియు రైతులు పాల్గొన్నారు.

రోబోటిక్ సర్జరీతో 25 ఏళ్ల యువతికి యూరెటరిక్ స్ట్రిక్చర్ చికిత్స

మంచిర్యాల : మూత్రం తగ్గిపోవడం, నడుము నొప్పికి కారణమైన కుడి డిస్టల్ యూరెటరిక్ స్ట్రిక్చర్ చికిత్స ద్వారా కుడివైపు నడుము నొప్పి మూత్రం తగ్గిపోవడం కింది పొత్తికడుపులో నొప్పి మూత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 25 ఏళ్ల యువతికి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీ ద్వారా విజయవంతంగా చికిత్స అందించారు. పరీక్షల్లో కుడి డిస్టల్ యూరెటరిక్ స్ట్రిక్చర్ ఉన్నట్లు గుర్తించారు దీంతో పాటు కుడివైపు యూరెటర్ విస్తరించి ఉన్నట్లు గుర్తించారు సమస్య ఉన్న ప్రదేశాన్ని పరిగణనలోకి తీసుకుని రోగికి రోబోటిక్ రైట్ యూరెటరిక్ రీ–ఇంప్లాంటేషన్ నిర్వహించారు. శస్త్రచికిత్స సమయంలో కుడి డిస్టల్ యూరెటరిక్ స్ట్రిక్చర్ విస్తరించిన యూరెటర్‌తో పాటు మూత్రాశయం ముందు పొత్తికడుపు గోడ మధ్య అడ్హీషన్స్ ఉన్నట్లు గుర్తించారు. శస్త్రచికిత్స అనంతరం ఎలాంటి సమస్యలు లేకుండా కోలుకున్న రోగి హీమోడైనమికల్‌గా స్థిరమైన పరిస్థితిలో డిశ్చార్జి అయ్యారు. డా. యశస్వి రెడ్డి టి. కన్సల్టెంట్ యూరాలజిస్ట్ ఆండ్రాలజిస్ట్ యూరో–ఆంకాలజిస్ట్ రోబోటిక్ మరియు రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ మాట్లాడుతూ యూరెటరిక్ స్ట్రిక్చర్ వల్ల మూత్ర మార్గం సంకుచితమై నడుము నొప్పి మూత్రం తగ్గిపోవడం వంటి సమస్యలు రావచ్చన్నారు. ఈ యువతిలో స్ట్రిక్చర్ ఉన్న ప్రదేశాన్ని పరిగణనలోకి తీసుకుని రోబోటిక్ యూరెటరిక్ రీ–ఇంప్లాంటేషన్ నిర్వహించామని తదుపరి ఫాలోఅప్ అవసరమని తెలిపారు. డా. పరిక్షిత్ అనస్థీషియా సేవలు అందించారు మూడు నెలల తర్వాత వైద్యుల క్లినికల్ అంచనా ప్రకారం డీటీపీఏ రీనోగ్రామ్ అవసరం కావచ్చని వైద్యులు సూచించారు. నిరంతరాయంగా నడుము నొప్పి మూత్రం తగ్గిపోవడం లేదా ఇతర మూత్ర సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో యూరాలజిస్ట్‌ను సంప్రదించాలని మలక్ పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అధునాతన వైద్య సదుపాయాలతో కూడిన యూరాలజీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు.

నూతన ఎస్సై ప్రవీణ్ కుమార్‌ని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

యువత భవిష్యత్తుకు భరోసా.. శాంతిభద్రతలకు పెద్దపీట!

బహిరంగ మద్యపానానికి అడ్డుకట్ట వేయాలి - ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి

-ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్ కి కాంగ్రెస్ నేతల వినతి



అక్టోబర్ 16, ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ / వర్ధన్నపేట) వర్ధన్నపేట పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు యువత భవిష్యత్తును కాపాడేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈగ దామోదర్ కోరారు. వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన భోగం ప్రవీణ్‌కుమార్‌ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

ప్రజలకు సత్వర న్యాయం అందాలి

ఈ సందర్భంగా ఈగ దామోదర్ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు సమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరి పట్ల పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను ఓపికగా విని సకాలంలో స్పందించాలని కోరారు. బాధితులకు న్యాయం అందించే విషయంలో జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. పట్టణంలో శాంతిభద్రతలను కాపాడుతూ చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలకు లోబడి ఉండాల్సిందేనని అన్నారు.

బహిరంగ మద్యపానంపై నిఘా పెట్టాలి

పట్టణంలోని ప్రధాన కూడళ్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బహిరంగ మద్యపానాన్ని నియంత్రించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల ప్రజలకు, ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, యువతకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పట్టణ సమస్యలపై ప్రత్యేక దృష్టి

వర్ధన్నపేట పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఈగ దామోదర్ కోరారు. పోలీసులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు రక్షణ కల్పించడం, నేరాల నియంత్రణ, యువతకు సురక్షిత వాతావరణం కల్పించడం వంటి అంశాల్లో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. హొఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్, కౌన్సిలర్ బెజ్జం పాపారావు, మండల యూత్ అధ్యక్షుడు భాను ప్రసాద్, పర్వతగిరి మండల అధ్యక్షురాలు సావిత్రి, లింగం రజిత రెడ్డి, విలాసారపు వెంకట్, షేక్ షబీర్, ఎర్ర శ్రీకాంత్, చింత మురళి, నందిపాక భాస్కర్, ఓర్సు వెంకట నర్సు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ నీరందించడమే లక్ష్యం!

- గ్రామాభివృద్ధికి యువ సర్పంచ్ సంతోష్ నిర్విరామ కృషి.
- నీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ.. పొదుపుగా వాడితేనే భవిష్యత్తుకు భరోసా.
- రాయపర్తిని మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే ప్రధాన కర్తవ్యం.



అక్టోబర్ 16, ప్రజాకలం ప్రతినిధి: (రాయపర్తి)

గ్రామాభివృద్ధే ధ్యేయంగా.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యువ సర్పంచ్ సంతోష్ ముందుకు సాగుతున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే సంకల్పంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, నీటి సరఫరాలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో బాధ్యతలను నిర్విరామంగా నిర్వర్తిస్తున్నారు.

ప్రతి ఇంటికీ నీరందేలా చర్యలు

గ్రామ ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఇంటికీ నీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తున్నామని సర్పంచ్ సంతోష్ తెలిపారు. ఏదైనా ఇంటికి నీరు సరఫరా కాకపోయినా, ఇతర సమస్యలు ఎదురైనా గ్రామ వాటర్‌మ్యాన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నీటి పొదుపుతోనే భవిష్యత్తుకు భరోసా

రాబోయే రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ సంతోష్ కోరారు. అవసరమైన మేరకే నీటిని వినియోగిస్తూ, వృథాను అరికట్టాలని సూచించారు. నీటి పొదుపు ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. నేటి నీటి పొదుపే రేపటి తరాలకు భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం.

గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తున్నానని సంతోష్ తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, అంతర్గత రహదారులు తదితర మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యమిస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

రాయపర్తి మండలంలో తమ గ్రామాన్ని ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో సమష్టిగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తన ప్రధాన కర్తవ్యమని యువ సర్పంచ్ సంతోష్ స్పష్టం చేశారు.

సబ్‌స్టేషన్‌కు ఆపరేటర్ ఏడి?

రైతుల కష్టాలు పట్టవా?

ప్రారంభోత్సవాలకే పరిమితమా?.. విద్యుత్ సమస్యలపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

మల్దకల్ ప్రతినిధి, అక్టోబర్ 16 (ప్రజా కలం):


జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి. శేఖర్ నాయుడు ఆధ్వర్యంలో నాగర్‌దొడ్డి గ్రామ సర్పంచ్ కె. వెంకటేశ్వరమ్మ, సత్యన్నతో పాటు పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సబ్‌స్టేషన్ ప్రారంభించారు.. ఆపరేటర్‌ను మరిచారా?

కుర్తి–రావులచెరువు గ్రామంలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించినప్పటికీ, నేటికీ ఆపరేటర్‌ను నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రారంభోత్సవాలకు చూపుతున్న ఉత్సాహాన్ని రైతుల సమస్యల పరిష్కారంలో ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. సబ్‌స్టేషన్ అందుబాటులో ఉన్నప్పటికీ సరైన నిర్వహణ లేకపోవడంతో రైతులకు ఆశించిన ప్రయోజనం అందడం లేదని విమర్శించారు.

విద్యుత్ కోతలతో రైతుల అవస్థలు

విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో పంటలకు నీరు అందించలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యుత్



ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో వ్యవసాయ పనులు సాగించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్యలు పెరిగాయని నాయకులు విమర్శించారు.

ఆపరేటర్‌ను నియమించకపోతే ఆందోళనలు తప్పవు

కుర్తి–రావులచెరువు సబ్‌స్టేషన్‌కు వెంటనే ఆపరేటర్‌ను నియమించి, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలపై ఎల్‌నినో ఎఫెక్ట్..

అడుగంటుతున్న డ్యామ్‌లు..

తిరుమల : ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో ఎల్‌నీనో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు వర్షాభావ పరిస్థితులతో శ్రీవారి కొండపై నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. అప్పుడప్పుడు తేలికపాటి వర్షాలు కురుస్తున్నప్పటికీ, జలాశయాల్లో నీటి మట్టాలు పెరగకపోవడం అధికారులు, భక్తుల్లో ఆందోళన కలిగిస్తోంది. గతంలో కేవలం సెలవు రోజుల్లో మాత్రమే తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండేది. కానీ, ఇటీవల రోజులతో సంబంధం లేకుండా నిత్యం లక్షలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివస్తున్నారు. దీంతో కొండపై నీటి వినియోగం భారీగా పెరిగింది. తిరుమలలోని 7,500 అద్దె గదులు, 5 భక్తుల వసతి సముదాయాలు , బహిరంగ మరుగుదొడ్లు, ఇతర సేవలకు ప్రతిరోజూ సుమారు 60 లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతోంది. తిరుమలలోని కుమారధార, పసుపుధార జలాశయాల్లో నీటి మట్టం పూర్తిగా అడుగంటిపోయింది. ప్రస్తుతం పాపవినాశనం, గోగర్భం డ్యామ్‌లలో మాత్రమే కొద్దిపాటి నీటి నిల్వలు ఉన్నాయి. ఈ నిల్వలు కేవలం 90 రోజులకు మాత్రమే సరిపోతాయని తిరుమల తిరుపతి దేవస్థానం వాటర్ వర్క్స్ ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. భక్తులకు నీటి యద్దడి తలెత్తకుండా నీటి సరఫరా, వినియోగంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. మరో వారం రోజుల్లో తిరుమల ప్రాంతంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సంకేతాలు ఇచ్చింది. సాధారణంగా ప్రతి ఏటా చివరి మాసాల్లో తిరుమలలో భారీ వర్షాలు కురుస్తాయని, వీటి వల్ల జలాశయాలు మళ్లీ నిండే అవకాశం ఉందని టీటీడీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పల్నాడు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నైట్ పెట్రోలింగ్

ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసుల ప్రత్యేక నిఘా

నరసరావుపేట : ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతలను పరిరక్షించేందుకు పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీ జగదీష్ అదహళ్లి ఆదేశాల మేరకు నరసరావుపేట పట్టణంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో వన్ టౌన్ సీఐ టి. ఫిరోజ్, ఎస్సై వంశీకృష్ణ, పోలీసు సిబ్బంది మురళి, రాము తదితర కానిస్టేబుళ్లు రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని పోలీసులు సూచిస్తున్నారు.

చాగంటి సీతమ్మకు రావూరి, వీరన్న, పాండ్యా, కోలేటి ఘన నివాళి

కారేపల్లి : మండల పరిధిలోని కొత్త కమలాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ సొసైటీ డైరెక్టర్ చాగంటి కోటయ్య తల్లి సీతమ్మ ఇటీవల మృతి చెందగా, బుధవారం నిర్వహించిన దశదిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ మండల ఉపాధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, మండల నాయకుడు అజ్మీర వీరన్న, మాజీ ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ధరావత్ పాండ్యా నాయక్, సొసైటీ డైరెక్టర్ కోలేటి రాధాకృష్ణ తదితరులు సీతమ్మకు నివాళులర్పించారు. అనంతరం చాగంటి కోటయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతుబంధు కన్వీనర్ గుగులోతు శ్రీను నాయక్, తోటకూరి వెంకటేశ్వర్లు, కొత్త తిరుపతయ్య, దుద్దిపాళ్ల భాస్కరరావు, గుగులోతు హరు నాయక్, వెంకయ్య, రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిధుల ద్వారా హైమాస్ట్ లైట్లు మంజూరు

జగిత్యాల: జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి మరియు రాయికల్ టౌన్ లో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ నిధుల ద్వారాహైమాస్ట్ లైట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని ఈరోజు బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ ఆతీ. బోగ శ్రావణి అందజేయడం జరిగింది. గ్రామంలో రాత్రివేళల్లో మెరుగైన వెలుతురు కల్పించడంతో పాటు ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పించేందుకు ఈ హైమాస్ట్ లైట్లు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. గ్రామ అభివృద్ధికి సహకరించిన ఎంపీ ధర్మపురి అర్వింద్ కి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి, జగిత్యాల్ పట్టణ అధ్యక్షులు కాశెట్టి తిరుపతి, స్థానిక కౌన్సిలర్ కల్లెడ ధర్మపురి,సురేష్,రాము, ఆముదరాజు, తక్కలపల్లి గ్రామ ఉపసర్పంచ్ కచ్చు మునిరాజు,బన్న సంజీవ్,గుర్రాల తిరుపతి రెడ్డి, పవన్ సింగ్, రవితేజ బోగ నరేష్,శ్రీనివాస్,శ్రవణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని ప్రైవేటీకరించబోం

ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి

హైదరాబాద్ : సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఆ హోటల్ ఆదాయం రోజుకు రూ.75 లక్షలు..

కేటీఆర్‌పై వెంకట్ బల్మూర్ తీవ్ర ఆరోపణ

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై శాసనమండలి ప్రభుత్వ విప్ వెంకట్ బల్మూర్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. గతంలో చెప్పినట్టుగానే కేటీఆర్ చీకటి బాగోతాలను వరుసగా బయటపెడుతూనే ఉంటానని, అందులో భాగంగానే ఆయన హోటల్ వ్యాపారానికి సంబంధించిన కొన్ని విషయాలను వెల్లడిస్తున్నట్లు తెలిపారు. రూ.5 కోట్ల షేర్ విలువ ఉన్న డెక్కన్ సరాయ్ హోటల్ ఆదాయం పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై తాను ఆరా తీయగా విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయని బల్మూర్ అన్నారు. కేటీఆర్ ఐటీ మంత్రిగా, షాడో ముఖ్యమంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. బహుళజాతి సంస్థ లను బెదిరించి, తమ కంపెనీలకు చెందిన ఫుడ్, ఈవెంట్స్, మీటింగ్స్ వంటివి తన హోటల్‌లోనే నిర్వహించేలా ఒప్పందాలు చేయించుకున్నారని విమర్శించారు. ఈ ఒప్పందాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ఇది కేటీఆర్, ఆయన టీమ్ చేస్తున్న నయా దందా అని అభివర్ణించారు. ఆ హోటల్ రోజువారీ ఆదాయం సుమారు రూ.75 లక్షలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.